మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 28-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 299 Issue: 299

28 ఏప్రిల్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:31 తిథి ద్వాదశి సా. 6:55 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) రా. 10:34 వరకు తరువాత హస్త యోగం వృఘతా రా. 9:02 వరకు కరణం బవ ఉ. 6:31 వరకు భాలవ సా. 6:55 వరకు వర్జ్యం తె. 4:53 నుండి ఉ. 6:34 వరకు దుర్ముహూర్తం ఉ. 8:26 నుండి ఉ. 9:17 వరకు రా. 11:05 నుండి రా. 11:50 వరకు రాహుకాలం మ. 3:22 నుండి సా. 4:57 వరకు యమగండం ఉ. 9:04 నుండి ఉ. 10:39 వరకు గుళికాకాలం మ. 12:13 నుండి మ. 1:48 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు మ. 2:59 నుండి సా. 4:40 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana

Published from Jagitial




## బీజేపీలో ఆప్ విలీనానికి రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు అధికారికంగా బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విలీనమయ్యారు. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ ఈ విలీనాన్ని ఆమోదించినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. బీజేపీలో చేరిన ఏడుగురు ఎంపీలు ఎంతో క్రమశిక్షణ కలిగిన వారని, పార్లమెంటరీ నిబంధనలకు లోబడి పనిచేసే వారంటూ కిరణ్ రిజిజు తరువాయి 2 వ పేజీలో...





## ఆ జడ్జి ఉంటే నేను కోర్టుకు రాను

### ఎక్సైజ్ కేసులో కేజ్రీవాల్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో జరుగుతున్న విచారణకు తాను వ్యక్తిగతంగా గానీ, తన లాయర్ ద్వారా గానీ హాజరుకాబోనని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం విచారణ జరుపుతున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మకు ఆయన నేరుగా లేఖ రాశారు. 'జస్టిస్ స్వర్ణకాంత గారి నుంచి నాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోయింది. అందుకే నేను మహాత్మా గాంధీ చూపిన తరువాయి 2 వ పేజీలో...

## పోలీసులకు 'మంచి' రోజులు

### పుట్టిన రోజు, పెళ్లి రోజులకు సెలవులు

### డీజీపీ శివధర్ రెడ్డి కీలక నిర్ణయం

### 22 మంది డీఎస్పీల బదిలీలు



పోలీసులు అంటే ఎంత కఠినంగా ఉంటారో వారి లైఫ్‌స్టైల్ కూడా అంతే కఠినంగా ఉంటుంది. అంటే.. డ్యూటీలో భాగంగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. పండగలు, ప్రత్యేక రోజులు వంటివి ఏం ఉన్నా కుటుంబ సభ్యులతో కలిసి ఉండే అవకాశం లేకుండా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే పోలీసుల కోసం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల జీవితాల్లో ఉండే ప్రత్యేక రోజులను.. వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉండేలా తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుల పుట్టినరోజు.. -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,371 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,119 |

## విశ్వవాణి



చంద్రుడిపై రూ.లక్షా 88 వేల కోట్లతో శాశ్వత నివాస సముదాయాన్ని నిర్మించేందుకు నాసా ప్లాన్ చేస్తోంది. 2033 నాటికి ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## బీఆర్ఎస్ ఓ శవం

### ఎంత అలంకరణ చేసినా ఏం ప్రయోజనం

### ఆ పార్టీకి భవిష్యత్తు లేదు: సీఎం రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఇప్పటివరకు గతం ఉందని, ఇక నుంచి భవిష్యత్ లేదని విమర్శలు చేశారు. 'బీఆర్ఎస్ పార్టీ ఒక చనిపోయిన శవం లాంటిది. అలాంటి శవానికి ఎంత అలంకరణ చేసినా ఉపయోగం ఉండదు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి కూడా అలాగే ఉంది' అని విమర్శించారు.

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): అసెంబ్లీ ప్రాంగణంలో కొత్త ఎమ్మెల్సీలు అజారుద్దీన్, కోదండరాం ప్రమాణ స్వీకారం తర్వాత ముఖ్యమంత్రి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా కవిత కొత్త పార్టీ తెలంగాణ రాష్ట్ర సేన ఏర్పాటుపై స్పందించిన రేవంత్ రెడ్డి .. కేసీఆర్ కుటుంబం అంతా ఒక్కటేనని తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ కుటుంబం తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని హేళన చేశారు. అదే సమయంలో కవిత కొత్త పార్టీపైనా సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ఉద్యమం సమయంలో ఎలా మాట్లాడినా ప్రజలు సహించారని.. కానీ రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చిన తర్వాత 10 ఏళ్లకూడా అలాగే మాట్లాడారని తరువాయి 2 వ పేజీలో...

# చిల్లర సర్కారు

## దారుణంగా రాష్ట్రంలో రైతుల పరిస్థితి



"సిట్టింగ్‌లైనా సరే ఎక్కువ చేస్తే టికెట్ ఇచ్చేదేలే

- బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పెద్ద వెధవ
- రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేశారు?
- మేం ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లం
- పొత్తుతో చంద్రబాబు జై తెలంగాణ అనేలా చేశా
- అటో కాలు.. ఇటో కాలు వేస్తానంటే కట్ చేస్త
- రాష్ట్ర స్థాయి మినహా అన్ని కమిటీలు రద్దు చేస్తున్న
- కొత్త కమిటీల్లో చురుకైన కార్యకర్తలకే అవకాశం
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ప్రస్తుతం తెలంగాణలో చిల్లర, చండాలమైన ప్రభుత్వం నడుస్తోందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా మారిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చేత కావడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావటం లేదని అన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): పొరుగు రాష్ట్రాల ప్రజలు అంబేద్కర్ విగ్రహాన్ని చూసేందుకు వస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గేట్లు తీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే ఏ ఒక్కరూ మాట్లాడలేదని మండిపడ్డారు.బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రజతోత్సవ సంబురాల ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలు, తాజా రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. తేజస్వీ సూర్య ఒక పెద్ద వెధవ అంటూ మండిపడ్డారు. అతడు అలా మాట్లాడుతుంటే ఒక్కరు కూడా అడ్డుపడలేదని ఆరోపించారు. తెలంగాణపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఏం చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. ఆ -2 వ పేజీలో...



## మళ్లీ నో స్టాక్

### హైదరాబాద్‌లోని పెట్రోల్ బంకులు బంద్

### స్టాక్ ఉన్న చోట కి.మీ. మేర బారులు

ఏపీలో కొనసాగుతున్న పెట్రోల్, డీజిల్ కొరత ఇప్పుడు తెలంగాణకు పాకింది. హైదరాబాద్ నగరంలోని చాలా పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి. ఇక స్టాక్ ఉన్న చోట కిలోమీటర్ వరకు ఆటోలు, వాహనదారులు బారులు తీరుతున్నారు. ఆదివారం తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కార్యాలయం నుంచి.. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదంటూ ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తుంది. బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు, బారులు తీరుతున్న వాహనదారుల దృశ్యాలు పెరిగిపోతున్నాయి. కొన్ని బంకుల్లో కేవలం పెట్రోల్ మాత్రమే ఉందని, డీజిల్ లేదని నిర్వాహకులు చెప్తున్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా ఇప్పటికే అస్సాం, కేరళ, -2 వ పేజీలో...



## ఎండలు.. వానలు

### పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు.. పనీపాట లేకుండా వానలు

### రాష్ట్రంలో భిన్న వాతావరణం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): తెలంగాణలో రాబోయే ఐదు రోజుల్లో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొననున్నాయి. ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు వీస్తుండగా, మరోవైపు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గడిచిన కొద్దిరోజులు తెలంగాణలో తరువాయి 2 వ పేజీలో...

## హైడ్రాకు సుప్రీంలో దెబ్బ

### బతుకమ్మకుంటలో బోర్డులు, శిలాఫలకాలు తొలగింపు

హైడ్రాకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట భూవివాదంపై హైడ్రాకు దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీచేసింది. ఈ కుంటపై తమ ఆధిపత్యాన్ని సూచించే బోర్డులు, శిలాఫలకాలను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు.



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): వివరాల్లోకి వెళితే.. అంబర్‌పేట్‌లోని సుమారు ఏడు ఎకరాల స్థలం విషయంలో ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య గత కొంతకాలంగా న్యాయపోరాటం నడుస్తోంది. ఈ స్థలం తన వ్యక్తిగత ఆస్తి అని, ఇది ఎప్పుడూ కుంట (నీటి వనరు) కాదని సుధాకర్ రెడ్డి వాదిస్తున్నారు. అయితే ఈ కేసు తరువాయి 2 వ పేజీలో...



## బెంగాల్‌లో రేపే పోలింగ్-2

### నిన్నటితో ముగిసిన ప్రచారం

### మే 4న 4 రాష్ట్రాల ఓట్ల లెక్కింపు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల చివరి విడత ప్రచారం సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. దీంతో గత నెల రోజులుకు పైగా హోరాహోరీగా సాగిన తరువాయి 2 వ పేజీలో...



## ఐదుగురు కార్మికులు దుర్మరణం

### హైదరాబాద్ శివారులో ప్రమాదం.. ఈదురు గాలులకు క్రేన్ కుప్పకూలి ఘటన

రంగారెడ్డి, ఏప్రిల్ 27 (ఈవార్తలు): హైదరాబాద్ శివార్లలో ఉన్న శంకర్‌పల్లి మండలంలో ఘోరం జరిగింది. మహాలింగాపురం గ్రామంలో ఉన్న ఎన్‌సీసీ సిమెంట్ ఇటుక బట్టీలో ప్రమాదం చోటు చేసుకుంది. సిమెంట్ ఇటుక ఫ్యాక్టరీలో భారీ గాలులకు ఓ భారీ క్రేన్ కూలిపోయింది. దీంతో

## రాశి ఫలాలు

28.4.2026

మేషం: దూర ప్రయాణాలలో నూతన మిత్రులతో పరిచయం కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. కుటుంబ సభ్యుల సహాయంతో చాలాకాలంగా పూర్తి కాని పనులను పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో భాగస్థులతో వివాదాలు నుండి కొంత వరకు బయటపడగలుగుతారు.

వృషభం: బంధుమిత్రుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. ఇంటాబయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆర్థికపరంగా ఉన్న ఇబ్బందులను అధిగమిస్తారు. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది. ఉద్యోగంలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు పొందుతారు.

మిధునం: ఒక వ్యవహారంలో సమాజంలో పేరు కలిగిన వారి సహాయంతో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆకస్మిక లాభాలు పొందుతారు. విలువైన, వస్త్ర, ఆభరణాలను కొనుగోలు చేస్తారు. గృహ నిర్మాణ విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

కర్కాటకం: ఆర్థిక పరిస్థితి కొంత అనుకూలంగా సాగుతుంది. వృత్తి, వ్యాపారాలలో ఏర్పడిన అవరోధాలు అధిగమించి స్వల్ప లాభాలను అందుకుంటారు. ఉద్యోగులకు అధికారుల ఆదరణతో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన పనులు పనులు నిదానంగా సాగుతాయి. గృహమున సంతాన వివాహ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

సింహం: వ్యాపార విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

కన్య: వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక సమస్యలు నుంచి బయట పడతారు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు సమసిపోతాయి. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. అన్ని రంగాల వారికి ఆదాయ మార్గాలు పెరుగుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

తుల: కుటుంబ సభ్యులతో వివాదాలు రాజీ చేసుకుంటారు. సంఘంలో పెద్దలతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. విలువైన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

వృశ్చికం: ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థిక లావాదేవీలు అనుకూలంగా సాగుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి దూర ప్రయాణాలు చేస్తారు. సోదరుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

ధనస్సు: చుట్టుపక్కల వారితో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. దూరప్రయాణాలు కలసివస్తాయి. వ్యాపార పెట్టుబడుల విషయంలో పునరాలోచన మంచిది. ఉద్యోగులకు అదనపు పని భారం నుండి ఉపశమనం కలుగుతుంది.

మకరం: కుటుంబ పెద్దల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు. ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగినా సమయానికి పూర్తిచేస్తారు. ధనాదాయం బాగుంటుంది. విద్యార్థులకు నూతన విద్యలపై ఆసక్తి పెరుగుతుంది.

కుంభం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. సంఘంలో నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. వ్యాపార ప్రారంభానికి ఆప్తుల నుండి పెట్టుబడులు అందుతాయి. గృహనిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. నూతన వాహన యోగం ఉన్నది.

మీనం: మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు విశేషంగా రాణిస్తాయి. నిరుద్యోగులకు పెద్దల అనుగ్రహంతో నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఉద్యోగమున పురోగతి కలుగుతుంది. గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

# చిల్లర సర్కారు

మొదటి పేజీ తరువాయి

సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవారని తేల్చి చెప్పారు. తెలంగాణ పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఉన్నంత చిత్తశుద్ధి ఎవరికీ ఉండదని స్పష్టం చేశారు.

పార్టీలో క్రమశిక్షణ లేని నేతలకు కేసీఆర్ గట్టి హెచ్చరికలు చేశారు. ఎవరైనా ఎక్కువ తక్కువ చేస్తే.. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కూడా సీట్లు ఇచ్చేది లేదని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడిన కేసీఆర్.. పార్టీ లైన్ తప్పిన వారిపై కొరడా తప్పదని తేల్చి చెప్పారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినా.. గులాబీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసినా ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో హడావిడి చేసే నేతలకు ఈసారి కేసీఆర్ బిగ్ వార్నింగ్ ఇచ్చారు. నెట్టింట డ్రామాలతో ప్రజలను, పార్టీలను మోసం చేసే ప్రయత్నాలు ప్రతీసారి పనిచేయవని బీఆర్ఎస్ పార్టీ నేతలకు కేసీఆర్ గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు ఎలా పనిచేస్తున్నారో చూసి.. వారికి పార్టీలో, పదవుల్లో గుర్తింపు ఉంటుందని తేల్చి చెప్పారు. ఇక పార్టీ మారే ఆలోచన చేస్తున్న పలువురు నేతలకు కూడా ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరికలు చేశారు. అటువైపో కాలు.. ఇటువైపో కాలు వేస్తామంటే కుదరదని తేల్చి చెప్పారు. నేతలంతా పార్టీ పట్ల పూర్తి నిబద్ధతతో ఉండాల్సిందేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీలో కొత్త కమిటీల ఏర్పాటు విషయంలో కేసీఆర్ కీలక సూచనలు చేశారు. చురుగ్గా పనిచేసే కార్యకర్తలకు మాత్రమే ఈ కొత్త కమిటీల్లో అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. కేవలం నేతలకు నచ్చిన వారికో లేదా వారి సన్నిహితులకో పదవులు ఇస్తే ఊరుకునేది లేదని కేసీఆర్ తేల్చి చెప్పారు. ఈ కమిటీల ఎంపికలో ఎవరికైనా అన్యాయం జరిగితే స్వయంగా తనకే ఫిర్యాదు చేయాలని గులాబీ కార్యకర్తలకు కేసీఆర్ కీలక సూచనలు చేశారు. అలాంటి ఫిర్యాదులను స్వయంగా తానే పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. నిఖార్సైన బీఆర్ఎస్ కార్యకర్తలకు.. కొత్త వారికి ఈ కొత్త కమిటీల్లో పెద్దపీట వేయాలని పార్టీ నేతలకు కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఎన్నికలకు సంబంధించి ఇవ్వాల్సిన టికెట్ల విషయంలో ఇప్పటి నుంచే కేసీఆర్ స్పష్టంగా సంకేతాలు ఇచ్చారు. సిట్టింగ్ నేతలు అనేది ముఖ్యం కాదని.. పార్టీలో క్రమశిక్షణతో పనిచేసి, నియమాలను పాటించే వారికి మాత్రమే ప్రాధాన్యం ఉంటుందని తేల్చి చెప్పారు. పార్టీకి విరుద్ధంగా ఎవరైనా పనిచేస్తే.. సిట్టింగ్‌లకు కూడా సీట్లు ఇచ్చే ప్రసక్తే లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజా సమావేశం ద్వారా బీఆర్ఎస్ పార్టీ అంతర్గత విభేదాలకు స్వస్తి చెప్పడమే కాకుండా.. క్షేత్రస్థాయి నుంచి పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం, అందులో టీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. అదే సమయంలో ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి.. ఆ సమయంలో తనను ఎన్నో సందర్భాల్లో మానసిక క్షోభకు గురి చేసినట్లు కేసీఆర్ గుర్తు చేసుకుని.. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తెలంగాణను వేరు చేయడానికి.. హైదరాబాద్ విషయంలో వెనక్కి తగ్గాలంటూ సోనియాగాంధీ తనకు 16 సార్లు చెప్పినట్లు కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్ విషయంలో రాజీ పడితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు




త్వరగా తేలిపోతుందని సోనియా గాంధీ తనతో చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. కానీ తాను మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గలేదని, వారి బెదిరింపులు, బుజ్జగింపులకు ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌తో కూడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని అప్పట్లోనే తాము గట్టిగా పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించినట్లు కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఇక 2009లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సమయంలో.. టీడీపీతో, టీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్న సందర్భంగాన్ని గుర్తు చేసిన కేసీఆర్.. అది ఎందుకు జరిగిందో వివరించారు. నారా చంద్రబాబు నాయుడుతో జై తెలంగాణ అని అనిపించేందుకే.. అప్పుడు టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని తేల్చి చెప్పారు.

## ఎండలు.. వానలు

మొదటి పేజీ తరువాయి

భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటున్నాయి. ఓవైపు ఎండలు దంచికొడుతుండగా, మరోవైపు కొన్నిచోట్ల వర్షాలు పడుతున్నాయి. మరికొన్నిచోట్ల ఈదురుగాలులు వీస్తుండగా ఉరుములు, మెరుపులుతో కూడిన వానలు కురుస్తున్నాయి. మరో నాలుగైదు రోజుల పాటు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండే అవకాశం ఉంది. సోమవారం హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. రాష్ట్రంలో రాబోయే నాలుగైదు రోజుల పాటు తీవ్రమైన ఎండలుంటాయి. అంతేకాకుండా అకాల వర్షాలు పడే అవకాశం ఉంది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం నుండి వీస్తున్న గాలుల ప్రభావంతో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అటు.. సోమవారం మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్ లో వాతావరణం మారిపోయింది. ఉరుములతో కూడిన గాలులు వీచాయి. రాత్రి సమయాల్లో పలు చోట్ల వర్షం కురిసింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉంది. ఇదే సమయంలో నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి, వికారాబాద్, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడొచ్చు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. బుధవారం నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హన్మకొండ, మల్కాజ్ గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. మే 3వ తేదీ వరకు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

## బీఆర్ఎస్ ఓ శవం

మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని.. ఆ పార్టీ మనుగడే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు గత పదేళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అహంకారంతో పాలన కొనసాగించారని పేర్కొన్నారు. అందుకే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీని, నాయకులను భరించలేక అధికారం నుంచి దించేశారని తెలిపారు. కొత్త పార్టీతో రాష్ట్రంలో అసలు పనే లేదని.. ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ పార్టీనే ఉంటుందా.. ఊడుతుందా అనే పరిస్థితికి చేరుకుందని రేవంత్ రెడ్డి సెటైర్లు గుప్పించారు. ఈ సందర్భంగా కవిత పార్టీపైనా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో కొత్త పార్టీ పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలతో సంబంధాలు లేవని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కేసీఆర్ రెస్ట్‌లో ఉన్న ప్రజాప్రతినిధి అని.. ఆయన చావును తానెందుకు కోరుకుంటానని రేవంత్ రెడ్డి నిలదీశారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉంటేనే తమకు మంచిదని పేర్కొన్నారు. కేసీఆర్ మర మనిషా కాదో.. ఆయన కుటుంబ సభ్యులకే తెలుసని అన్నారు. వివక్ష లేని పాలన తమది అని.. తమకు ప్రతిపక్షమే లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మరోవైపు.. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కూడా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును తెలంగాణ హైకోర్టు తప్పుపట్టలేదని ఈ సందర్భంగా సీఎం తేల్చి చెప్పారు. కమిషన్ రిపోర్టులో సాంకేతిక లోపాలు ఉన్నాయని మాత్రమే కోర్టు చెప్పిందని పేర్కొన్నారు. రిపోర్టు ఆధారంగా చర్యలు వద్దని హైకోర్టు చెప్పినట్లు గుర్తు చేశారు. సీబీఐ విచారణ తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.

## బెంగాల్‌లో రేపే పోలింగ్-2

మొదటి పేజీ తరువాయి

ప్రచారానికి తెరపడింది. మైకులు మూగబోయాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహిస్తున్నారు. బెంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా... తొలి విడతలో 152 నియోజకవర్గాలకు ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించారు. రెండో విడతలో మిగిలిన 142 స్థానాలకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. రెండో విడత ఎన్నికలకు సంబంధించిన ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. రెండవ దశలో పోలింగ్ జరిగే అసెంబ్లీ నియోజకవర్గాలు కోల్‌కతా నార్త్, కోల్‌కతా సౌత్, హౌరా, నాదియా, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ, పూర్వ బర్ధమాన్‌ల జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని ప్రధాన పార్టీల నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాయి. రెండో విడత ప్రచారంలో చివరి రోజున బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి మోదీ బారక్‌పూర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఇక, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా తమ అభ్యర్థుల తరఫున ప్రచారంలో బిజీ బిజీగా గడిపారు. మరోవైపు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీలు ప్రమోద్ తివారీ, అఖిలేష్ ప్రసాద్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల తర్వాత పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పొత్తు లేకుండా ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తోంది. కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

## మళ్లీ నో స్టాక్

మొదటి పేజీ తరువాయి

పుదుచ్చేరి, తమిళనాడు ఎన్నికల పోలింగ్ ముగిసిపోగా...పశ్చిమ బెంగాల్ మొదటి దశ పోలింగ్ ముగిసింది. మిగిలిపోయిన బెంగాల్ రెండో దశ ఎన్నికల పోలింగ్ ఈ నెల 29న జరుగనుంది. ఈ పోలింగ్ ముగిశాక దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత సమస్యలు, ధరల పెంపు తప్పకపోవచ్చన్న ఆందోళన ప్రజల్లో వ్యాప్తి చెందుతోంది. దీంతో బంకుల వద్ద రద్దీ పెరిగిపోతుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఓ వైపు ఇరాన్ తో అమెరికా యుద్ధం విరమణ చేయకపోవడం.. ఇంకోవైపు భారత్ లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిపోతున్న నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత, ధరల పెంపు సమస్యలు ఎదురుకావచ్చన్న భయం ప్రజలను పీడిస్తోంది.


## ఐదుగురు కార్మికులు దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

ఆ క్రేన్ కింద చిక్కుకుని.. కొందరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరికి తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయిన సంగతి తెలిసిందే. అప్పటివరకు దంచికొట్టిన సూర్యుడు.. మేఘాల వెనక్కి వెళ్లిపోవడంతో.. వాతావరణం చీకటిగా మారిపోయింది. ఈ క్రమంలోనే కొన్ని చోట్ల వర్షాలు కూడా కురిశాయి. మరికొన్ని చోట్ల గాలి, దుమారం వీచింది. హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో.. చిమ్మ చీకట్లలా మబ్బులు కమ్మేశాయి. అదే సమయంలో భారీ ఎత్తున ఈదురుగాలులు వీచాయి. ఈ గాలుల ధాటికి.. ఎన్‌సీసీ సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమలో ఉన్న ఓ భారీ క్రేన్ కూలింది. ఈ దుర్ఘటనలో అక్కడే పనిచేస్తున్న కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. అంబులెన్స్‌లలో బాధితులను శంకర్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ సిమెంట్ ఇటుక కంపెనీలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు ఉన్నాయి అనేదానిపై విచారణ జరుపుతున్నాయి.

## హైడ్రాకు సుప్రీంలో దెబ్బ

మొదటి పేజీ తరువాయి



కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టిందని ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా భావించిన హైడ్రా.. ఇక్కడ సుమారు ఐదు ఎకరాల్లో చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ ఎయిర్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసి సుందరీకరించింది. గతేడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. కోర్టులో స్టేటస్ కో (యథాతథ స్థితి) ఆర్డర్ ఉండగా అభివృద్ధి పనులు చేయడంపై గతంలో తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దీనిని కోర్టు ధిక్కరణగా భావించి, అక్కడ హైడ్రాకు సంబంధించిన పేర్లు, గుర్తులను మూడు వారాల్లోగా తొలగించాలని ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై హైడ్రా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, తదుపరి విచారణ జరిగే వరకు హైకోర్టు ఆదేశాలనే పాటించాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో హుటాహుటిన ఏమాత్రం ఆలస్యం చేయకుండా హైడ్రా సిబ్బంది బతుకమ్మ కుంట వద్ద ఉన్న తమ విభాగానికి సంబంధించిన బోర్డులు, ప్రారంభోత్సవ శిలాఫలకాలను తొలగించారు. అయితే, విచారణ ముగిసే వరకు ఈ స్థలం ఎవరికి చెందుతుందనేది ఉత్కంఠగా మారింది.

## ఆ జడ్జి ఉంటే నేను కోర్టుకు రాను

మొదటి పేజీ తరువాయి

సత్యాగ్రహ మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాను' అని కేజ్రీవాల్ తన లేఖలో పేర్కొన్నారు. తన అంతరాత్మను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నానని, జస్టిస్ స్వర్ణకాంత నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసే హక్కును వినియోగించుకుంటానని ఆయన తెలిపారు. గతంలో ఇదే కేసు విచారణ నుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకోవాలని కోరుతూ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమె విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించరనే అనుమానం తనకు ఉందని ఆరోపించారు. అయితే, ఈ పిటిషన్‌ను జస్టిస్ శర్మ కొట్టివేశారు. నిరాధారమైన ఆరోపణలు, ఊహాజనిత అనుమానాలతో జడ్జిని మార్చలేమని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. తన కుటుంబ సభ్యుల వృత్తిని ప్రస్తావిస్తూ చేసిన ఆరోపణలను కూడా ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్ తాజాగా విచారణకు హాజరుకాకూడదని నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## పోలీసులకు 'మంచి' రోజులు

మొదటి పేజీ తరువాయి

పెళ్లి రోజున వారికి ప్రత్యేకంగా సెలవు మంజూరు చేయాలని పేర్కొంటూ తాజాగా డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. ఒత్తిడిలో పనిచేస్తూ పోలీసులు తమ వ్యక్తిగత జీవితానికి అస్సలు సమయం ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్న డీజీపీ వారి కోసం ఏదైనా నిర్ణయం తీసుకోవాలని ఆలోచించినట్లు తెలిపారు. పోలీసులకు మానసిక ఉల్లాసంతో పాటు.. తమ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ సెలవుల నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే తప్ప పోలీసు సిబ్బందికి ఈ రెండు రోజుల సెలవులను మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఆధారాలు, దరఖాస్తు ఆధారంగా పోలీసులకు పెళ్లి రోజు, పుట్టిన రోజుల్లో సెలవులను మంజూరు చేయనున్నట్లు తేల్చి చెప్పారు. మరోవైపు.. రాష్ట్రంలో 22 మంది డీఎస్పీలు ట్రాన్స్‌ఫర్లు అయ్యారు. ఈ డీఎస్పీ ట్రాన్స్‌ఫర్లకు సంబంధించి కూడా డీజీపీ శివధర్‌రెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పలువురు ఏసీపీలు కూడా బదిలీ అయ్యారు.

**రాష్ట్రంలో బదిలీ అయిన డీఎస్పీలు వీరే..**

- ఓయూ ఏసీపీ – నర్సింగరావు
- ఉప్పల్ ఏసీపీ – వెంకట్‌రెడ్డి
- చిక్కడపల్లి ఏసీపీ – రణ్‌వీర్‌రెడ్డి
- మలక్‌పేట ఏసీపీ – రాజా వెంకట్‌రెడ్డి
- గోషామహల్ ఏసీపీ – చంద్రశేఖర్‌రెడ్డి
- ఆసిఫ్‌నగర్ ఏసీపీ – శ్రీనివాస్
- మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ – వెంకటేశ్వరరావు
- వికారాబాద్ ఏసీపీ – అంజయ్య
- మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ ఏసీపీ – రాజశేఖర్‌రెడ్డి
- జగిత్యాల డీఎస్పీ – పురుషోత్తంరెడ్డి
- కామారెడ్డి డీఎస్పీ – మధుసూదన్
- ఆసిఫాబాద్ డీఎస్పీ – అశోక్
- భద్రాచలం డీఎస్పీ – అరుణ్‌కుమార్
- నిర్మల్ డీఎస్పీ – టీ శ్రీనివాస్

# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఒత్తిడి

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి విచారణ చేపట్టేందుకు ఎటువంటి అడ్డంకులు లేవని సీఎం స్పష్టం చేశారు. కాళేశ్వరం అంశంపై ప్రస్తుతం ఎక్కడా కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో లేవని, కాబట్టి సీబీఐ దర్యాప్తుకు మార్గం సుగమమైందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు. న్యాయ నిపుణుల సూచనల మేరకు, తక్షణమే సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాజకీయంగా కూడా పావులు కదపాలని ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైతే రాష్ట్ర మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి సీబీఐ డైరెక్టర్‌ను స్వయంగా కలవాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన సాంకేతిక లోపాలు, నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే వచ్చిన నివేదికలను సీబీఐకి అందజేయాలని నిర్ణయించారు. ప్రజా ధనం దుర్వినియోగం కావడానికి కారణమైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.





# ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం

## హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. ఇరువురికి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): గత కొన్ని నెలలుగా సాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారిని ఎమ్మెల్సీలుగా నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే నేడు వారిద్దరూ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అజారుద్దీన్, కోదండరాంలతో.. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తాజాగా ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో గత కొన్ని రోజులుగా అజారుద్దీన్ మంత్రి పదవి ఉంటుందా పోతుందా అనే ఉత్కంఠకు తెరపడింది. మండలిలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు పలువురు మంత్రులు కూడా హాజరయ్యారు. గవర్నర్ కోటాలో మహమ్మద్ అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేయగా.. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాలతో సాధారణ పరిపాలన శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎమ్మెల్సీగా తన పేరును ప్రతిపాదించినందుకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు, రాష్ట్ర మంత్రి మండలికి, పీసీసీకి అజారుద్దీన్ థ్యాంక్స్ చెప్పారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమం కోసం తాను మరింత కృషి చేస్తానని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముస్లింల ఓట్ల కోసమే తనకు మంత్రి పదవి ఇచ్చారని అనడంలో ఎలాంటి నిజం లేదని.. ముందు నుంచీ సీఎం రేవంత్ రెడ్డి మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు అజారుద్దీన్ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఇక తనకు క్రికెట్ ఫ్యాన్స్ ఎక్కువ అని.. అందుకే పొలిటికల్ ఫ్యాన్స్‌ని పెంచుకుంటానని తెలిపారు. పదవులు అలంకారాలు కాదని కోదండరాం పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేసేందుకే పదవులు అని వెల్లడించారు. ఎమ్మెల్సీ పదవి లేకముందు, వచ్చిన తర్వాత ఒకే రకంగా పనిచేస్తామని చెప్పారు. రిజర్వేషన్ల పెంపు, ఆదివాసీల భూ సమస్య, నిరుద్యోగ సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై పని చేస్తామని తెలిపారు. మంత్రి పదవిపై తనకు ఆశ లేదని స్పష్టం చేశారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం తాను ముందుకు సాగుతానని తేల్చి చెప్పారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల సమీక్ష

**పథకంలో వేగం.. అధికార వికేంద్రీకరణ**

**కలెక్టర్లకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయడానికి అధికార వికేంద్రీకరణ చేసి జిల్లా కలెక్టర్లకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా లోతైన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ప్రస్తావించిన అంశాలపై అక్కడికక్కడే స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని.. హౌసింగ్ అధికారులతో ప్రతి వారం సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూడటానికి ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోని వారు, ఇప్పుడు దరఖాస్తుకున్నా అర్హత ఉంటే



ఇంటిని మంజూరు చేస్తామని వెల్లడించారు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేశామని, ఆయా లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లను నిర్మించుకునేలా ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. వివిధ కారణాలతో ఇండ్లు నిర్మించుకోలేని వారు, తమకు ఇల్లు అవసరం లేదని తెలియచేస్తే వారి స్థానంలో మరొకరికి కేటాయించాలని అన్నారు. పేదవారి అభివృద్ధి సంక్షేమం విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. నాటి ప్రభుత్వం అక్కడక్కడా నిర్మించి, అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయాలని, అలాగే మంచినీరు, కరెంటు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకుని 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా జీ ప్లస్ వన్ పద్ధతిలో ఇండ్లను నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించామని చెప్పారు. భూ సర్వేతోనే వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని.. ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలోని ఐదు మండలాలలో ప్రయోగాత్మకంగా సర్వే మ్యాపుతో రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత సర్వే మ్యాపు నెంబరు, భూదార్ నెంబరు కేటాయిస్తున్నామని తెలిపారు. సాదా బైనామాలకు సంబంధించి వీలైనంత త్వరగా దరఖాస్తులను పరిష్కరిస్తామని వివరించారు. కొనుగోలుదారుడు ఒక్కడే డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని, ఈ దరఖాస్తుల పరిష్కారం మరింత వేగవంతం చేయడానికి వీలుగా ఆర్డీవోలకే అధికారాలను ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా తహశీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రతి జిల్లా కేంద్రంలో అత్యాధునిక వసతులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాల్లో నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రి దాసరి అనసూయ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి జి.వివేక్, ప్రభుత్వ సలహాదారులు పీ సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, ఆయా జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, హౌసింగ్ సెక్రెటరీ వీపీ గౌతం తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ శ్రీచైతన్య కాలేజీలో దొంగతనం

**రూ. 5 లక్షల నగదు,**

**బంగారు గొలుసుతో పరార్**

కరీంనగర్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): కరీంనగర్‌లోని మంకమ్మతోట ప్రాంతంలో ఉన్న శ్రీచైతన్య కాలేజీలో దొంగతనం జరిగింది. ఈ చోరీని పోలీసులు ఛేదించారు. జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడి, విద్యా సంస్థలనే లక్ష్యంగా చేసుకుంటున్న పాత నేరస్తుడు బొద్దుల యుగేందర్‌ను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్ 26వ తేదీ తెల్లవారుజామున మంకమ్మతోటలోని శ్రీ చైతన్య కాలేజీ ఆఫీసు తాళాలు పగులగొట్టిన నిందితుడు, బీరువాలో ఉన్న రూ. 5 లక్షల నగదు, ఒక బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. దొంగిలించిన సొత్తును ఎవరికీ అనుమానం రాకుండా తన ఇంటి వెనుక ఉన్న కట్టెల కుప్పలో దాచిపెట్టాడు. పోలీసులు పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, దొంగిలించిన రూ. 5 లక్షల నగదును, 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

# మంత్రి ఉత్తమ్ పేరుతో భారీ స్కామ్

**ఇన్‌ఫ్రా సంస్థకు రూ.1.70 కోట్ల టోకరా**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): ప్రముఖులతో పరిచయాలు ఉన్నాయని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు నానాటికీ ఎక్కువ అవుతున్నాయి. తాజాగా అలాంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. ప్రభుత్వంలోని పెద్దలతో తనకు పరిచయాలు ఉన్నాయని నమ్మించి, ఓ ప్రముఖ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ నుంచి భారీగా వసూలు చేసిన పురిమెట్ల బంగారు యాదవ్ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

# వ్యూహాత్మక రహదారులకు రూ.7,042 కోట్లు

**మౌలిక వసతులకు పరిపాలనా అనుమతులు జారీ**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'హెచ్-సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అనే బృహత్తర ప్రాజెక్టును పట్టాలెక్కించింది. గత ప్రభుత్వ హయాంలో మొదలై అసంపూర్తిగా ఉన్న వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) పనులతో పాటు కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి నగర రూపురేఖలు మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం రూ.7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగమైన రూ.5,942 కోట్లను 'హెచ్-సిటీ' పనులకే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టు అమలును వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్ల కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.1,090 కోట్లతో భారీ నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనిని రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో రూ.580 కోట్లతో కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్లలో రెండు స్టీల్ బ్రిడ్జిలు, మూడు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీ కింద రూ.510 కోట్లతో ఫిల్మ్‌నగర్, రోడ్డు నంబర్ 45 జంక్షన్ల వద్ద మరో నాలుగు స్టీల్ బ్రిడ్జిలు, నాలుగు అండర్‌పాసులు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. మరోవైపు దక్షిణ హైదరాబాద్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నల్గొండ ఎక్స్ రోడ్స్-సైదాబాద్-ఐఎస్ సదన్ -ఓవైసీ జంక్షన్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. సుమారు 2.5 కిలోమీటర్ల పొడవుతో రూ.620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పాతబస్తీ, కొత్త నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది.



# పార్టీలు వస్తుంటాయ్.. పోతుంటాయ్

**పాతికేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు తక్కువ**

**కవిత టీఆర్ఎస్‌పై కేటీఆర్ స్పందన**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): తన సోదరి కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయని వ్యాఖ్యానించారు. భారతదేశంలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. కొత్త పార్టీని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ గురించి చాలామంది ఏదేదో మాట్లాడుతున్నారని, వాటిని కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంటులో తెలంగాణ విభజన గురించి తప్పుగా మాట్లాడితే ముందుగా ఖండించింది తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావులేనని కేటీఆర్ గుర్తు చేశారు. తేజస్వీ సూర్య తనకు కూడా ఫోన్ చేసి, తాను మాట్లాడిన దానిని మీ (బీఆర్ఎస్) వాళ్లు తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారని, కానీ మీరు మాట్లాడింది తప్పని ఆయనకు చెప్పేశానని కేటీఆర్ తెలిపారు. మేం ఖండించిన తర్వాతనే ఆయన సభలో వివరణ ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు లోక్ సభలో ఉండి ఉంటే మా వాళ్లు అప్పుడే ఖండించేవారని చెప్పారు.

**తెలంగాణకు విముక్తి కల్పిస్తాం: కేటీఆర్**

కాంగ్రెస్, బీజేపీ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడుగడుగునా పోరాటాలు చేస్తూ ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టారని అన్నారు. 14 సంవత్సరాల పాటు తెలంగాణ కోసం కేసీఆర్ పోరాటం చేశారని, ఆ తర్వాత పదేళ్లు మంచి పాలన అందించారని అన్నారు. దశాబ్దాలుగా దగాపడ్డ తెలంగాణ కోసం అన్ని పదవులు వదులుకొని, 25 సంవత్సరాల క్రితం ఇదే రోజు జలదృశ్యంలో కేసీఆర్ పార్టీని స్థాపించారని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఉద్యమించి, తెలంగాణ ప్రజలను, జాతిని ఐక్యం చేసి ఢిల్లీ మెడలు వంచారని అన్నారు. తెలంగాణను సాధించాక ప్రజలు అధికారం ఇస్తే, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన పెట్టిన నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం ఈ రెండున్నరేళ్లుగా ఈ దుర్మార్గపు పాలనలో అణచివేతలకు గురవుతున్న ప్రజలకు బీఆర్ఎస్ గొంతుకై నిలుస్తోందని అన్నారు.



నేటి ఈవార్తలు

మంగళవారం 28-4-2026, జగిత్యాల

# డీజిల్ కొరత.. బంక్ వద్ద ట్రాక్టర్లు, హార్వెస్టర్ల బారులు

ఎండపల్లి, ఏప్రిల్ 27 (ఈవార్తలు): జిల్లా ఎండపల్లి మండలంలో డీజిల్ కొరత తీవ్రంగా నెలకొంది. రాజారాంపల్లి గ్రామంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద డీజిల్ కోసం ట్రాక్టర్, హార్వెస్టర్ యజమానులు భారీగా బారులు తీరారు. మండలంలో ఉన్న మూడు పెట్రోల్ బంకుల్లో రెండు మూతపడటంతో ఒక్క బంక్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీజిల్ అయిపోతుందన్న సమాచారంతో వాహనదారులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో కొరత మరింత పెరిగింది. వరి కోతల సీజన్‌లో ఈ పరిస్థితి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోసిన ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన ట్రాక్టర్లు, హార్వెస్టర్లు డీజిల్ లేక నిలిచిపోవడంతో పనులు అంతరాయం కలుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

# కుట్టుమిషన్లతో బీసీ మహిళల ఆర్థిక సాధికారత: జ్యోతి



జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): రాష్ట్రంలో బీసీ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రశంసించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ప్రభుత్వం బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని, కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 1,000 మందికి 100 శాతం సబ్సిడీతో ఆధునిక కుట్టు మిషన్లు అందించడం అభినందనీయమన్నారు. నైపుణ్యం ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించవచ్చని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇలాంటి పథకాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# జగిత్యాల బల్దియాలో అక్రమాల దర్యాప్తు

**ఏసీబీ తర్వాత విజిలెన్స్ దాడులు కలకలం**

జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 27 (ఈవార్తలు): ఇటీవల ఏసీబీ దాడులతో కలకలం రేపిన జగిత్యాల మున్సిపాలిటీ మళ్లీ విజిలెన్స్ తనిఖీలతో వార్తల్లో నిలిచింది. సోమవారం ఉదయం నుంచే విజిలెన్స్ అధికారులు విస్తృతంగా సోదాలు చేపట్టారు. సుమారు 8 బృందాలుగా దాదాపు 60 మంది అధికారులతో మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా రెవెన్యూ విభాగంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో భవనాల అసెస్మెంట్లు, పన్నుల విధింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దృష్టి సారించారు. అధికారులు నేరుగా భవనాల వద్దకు వెళ్లి కొలతలు తీస్తూ, పత్రాల్లోని వివరాలు--వాస్తవ పరిస్థితుల మధ్య తేడాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. వరుస తనిఖీలు మున్సిపల్ పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఏసీబీ తర్వాత విజిలెన్స్ రంగంలోకి దిగడంతో అక్రమాలపై కఠిన చర్యలు ఉంటాయా? లేక తనిఖీలకే పరిమితం అవుతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. పట్టణ ప్రజల్లో మున్సిపాలిటీ పనితీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



# అడవి దున్నల వేట!

**అటవీ శాఖ నిర్లక్ష్యం.. వేటగాళ్ల దౌర్జన్యం**

బీర్‌పూర్, ఏప్రిల్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో అడవి దున్నల వేట సంచలనంగా మారింది. బీర్‌పూర్ మండలం రంగాసాగర్, రేచపల్లి మండలం మేడారం తండా పరిధిలో ఇటీవల సంచరిస్తున్న అడవి దున్నలు అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇటీవల దారితప్పి వచ్చిన నాలుగు అడవి దున్నలు గ్రామాల పరిసరాల్లో సంచరించడంతో పంటలకు నష్టం వాటిల్లింది. ఈ విషయమై రైతులు అటవీ శాఖకు ఫిర్యాదు చేశారు. అయితే కొద్ది రోజులకే రెండు దున్నలు విగతజీవులుగా కనిపించాయి. విద్యుత్ కంచె తగిలి మృతి చెందినట్లు సమాచారం. సాక్ష్యాలు దొరక్కుండా దుండగులు రాత్రికి రాత్రే మృతదేహాలను తగలబెట్టినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఘటనపై అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరణించిన దున్నల్లో ఒకదానికే పోస్టుమార్టం నిర్వహించి, మరో దున్న విషయాన్ని పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఘటన జగిత్యాల లేదా ధర్మపురి పరిధిలోదా అన్న విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం పలు సందేహాలకు దారితీస్తోంది. వేటగాళ్లపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మిగిలిన రెండు దున్నలను రక్షించాలని, అవి సురక్షితంగా ఉన్నాయా అన్న దానిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. కాగా, రంగాసాగర్, రేచపల్లి మండలం మేడారం తండా పరిధిలో ఇటీవల సంచరిస్తున్న అడుగుదున్నలు చనిపోయిన ఘటనపై నోటీసులు జారీ చేసి, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 6 మందిపై కేసులు నమోదు చేసినట్లు డీఎఫ్ వో రవిప్రసాద్ తెలిపారు. ఈ కేసును కోర్టుకు పంపించామని వెల్లడించారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై, అధికారులకు నివేదిక పంపిన డీఎఫ్ వో రవిప్రసాద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాల్, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జగిత్యాల పద్మారావు,ల పై శాఖాపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని తెలిపారు.

# ఇటుక బట్టీల పేరుతో భూఆక్రమణ

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా నర్సింగాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిపై మరోసారి ఆక్రమణ యత్నం జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంశీతో పాటు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 437లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి ఇటుక బట్టీల ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇదే భూమి గతంలో ఆక్రమణకు గురికాగా, ఇటీవలే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికీ మళ్లీ ఆక్రమణ ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ భూమిని గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలకు కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వంశీ, గ్రామస్తులు కలెక్టర్‌ను వినతిచేశారు.

# విశాఖలో ఇన్ఫోసిస్‌కు 20 ఎకరాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలిపే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు విశాఖపట్నంలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో ఇన్ఫోసిస్ తన కేంపస్‌ను ఇక్కడ విస్తరించనుంది.

# బోరుబావుల లెక్కెంత?

**డ్రిల్లింగ్ డేటాను రికార్డు చేయాలి.. ప్రతి బోరుబావి దేశ జల భౌగోళిక ఆస్తి.. నేడు హైదరాబాద్‌లో ప్రాంతీయ వర్క్‌షాప్**

హైదరాబాద్, ఏప్రిల్ 27 (పీఐబీ): దేశంలో తాగునీటి అవసరాల్లో బోరు బావుల పాత్ర అత్యంత కీలకమైనది. అయితే, దీనిపై శాస్త్రీయమైన, ఓ ప్రామాణిక డేటా అందుబాటులో లేదు. వాస్తవానికి బోరు బావులు దేశ జల భౌగోళిక ఆస్తి. ఇలాంటి డేటాను సంస్థాగతీకరించడం చాలా ముఖ్యం. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేంద్ర భూగర్భ జలాల బోర్డు (సీజీడబ్ల్యూబీ) దక్షిణ ప్రాంత విభాగం మంగళవారం ఒక రోజు ప్రాంతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. “భూగర్భ జలాల డ్రిల్లింగ్ డేటా ప్రామాణీకరణ, జాతీయ జల భౌగోళిక ఆస్తిగా బోరు బావులను సంస్థాగతీకరించడం, డేటా సేకరణ” అంశంపై ఈ వర్క్‌షాప్ జరగనుంది. భూగర్భ జలాల అభివృద్ధి, డ్రిల్లింగ్ కార్యకలాపాలు, జల వనరుల నిర్వహణలో అనుభవం ఉన్న వివిధ కీలక భాగస్వాములందరినీ ఒక్క వేదికపైకి చేర్చి, డ్రిల్లింగ్ డేటాను ప్రామాణీకరించడం. దానిని జాతీయ జల భౌగోళిక ఆస్తిగా గుర్తించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యం. దేశవ్యాప్తంగా తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం భూగర్భ జలాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే, వివిధ సంస్థలు చేపట్టే బోరు డ్రిల్లింగ్ ద్వారా భూగర్భ శిలాశాస్త్రం, జలస్తరాల లక్షణాలు, బావుల నిర్మాణం, నీటి దిగుబడి సామర్థ్యం, నీటి నాణ్యతపై విలువైన సమాచారం వివిధ విభాగాల్లో విభిన్న విధానాలతో నమోదు చేయబడుతోంది. ఏకరూప ప్రమాణాలు లేకపోవడం వల్ల ఈ సమాచారాన్ని సమగ్ర భూగర్భ జల డేటాబేస్‌తో ఏకీకృతం చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రిల్లింగ్ డేటా సేకరణ, ప్రామాణీకరణ, రిపోర్టింగ్ ప్రక్రియల్లో ఏకరూప ప్రమాణాలను ఏర్పాటు చేయడం, ప్రతి బోరు బావును దేశ జల భౌగోళిక ఆస్తిగా గుర్తించడం అనే అంశాలపై ఈ వర్క్‌షాప్ దృష్టి సారించనుంది. శిలాస్తర సంబంధిత డేటా, బావుల నిర్మాణ వివరాలు, పంపింగ్ పరీక్షల డేటా, జలస్తర ప్రమాణాలు, డిజిటల్ సాధనాల ద్వారా డేటా సేకరణ, ధ్రువీకరణ, నాణ్యత నియంత్రణ వంటి కీలక అంశాలపై చర్చలు జరుగనున్నాయి. అంతేకాకుండా, జాతీయ స్థాయిలో ఏకీకృత భూగర్భ జల డ్రిల్లింగ్ డేటాబేస్ ఏర్పాటు కోసం విధాన రూపకల్పనపై కూడా భాగస్వాముల మధ్య సమగ్ర చర్చలు జరుగుతాయి. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర భూగర్భ జల విభాగాల అధికారులు, జల్ జీవన్ మిషన్ ఇంజినీర్లు, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం (పీహెచ్ఈడీ) అధికారులు, నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ ప్రతినిధులు, పొరుగు సేవల డ్రిల్లింగ్ కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు పాల్గొననున్నాయి. ఈ వర్క్‌షాప్ ద్వారా అనుభవాలు పంచుకోవడం, సవాళ్లను పరిష్కరించడం, భూగర్భ జల డేటాను ఏకీకృతంగా నిర్వహించడం దిశగా ఒక ఉమ్మడి వేదిక అందించడం లక్ష్యం. దేశంలో భూగర్భ జలాల డేటా వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఈ ప్రాంతీయ వర్క్‌షాప్ ఒక ముఖ్యమైన ముందడుగు కానుంది. ఇది సుస్థిర జల నిర్వహణ, జల భద్రత లక్ష్యాలను సాధించడంలో కీలకంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాలలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అనంతరం సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దావా వసంత సురేష్ మాట్లాడుతూ ఎన్నో కుట్రలు కుతంత్రాలను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరినీ ఏకం చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా తెలంగాణ రాష్ట్రం సాధించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని బీఆర్ఎస్ పార్టీలో ఉండడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలి దానాలు అయితే పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల బలిదానం అవుతుందని, స్వరాష్ట్ర పాలనలో కాకుండా సమైక్య పాలనలో ఉన్నట్టు రేవంత్ రెడ్డి పాలన ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు నాయకులకు కార్యకర్తలకు అభిమానులు అందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధర్మపురి, ఏప్రిల్ 27 (ఈవార్తలు): ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు (ఐకేపీ సెంటర్లు) సోమవారం ప్రారంభమయ్యాయి. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ గోళ్ళ తిరుపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి పాల్గొని కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వడ్లలో ఎలాంటి కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే వర్షాకాలంలో సన్నరకం వరి సాగు చేయాలని రైతులకు సూచిస్తూ, దీనివల్ల బోనస్‌తో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన సన్న బియ్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడ రాంరెడ్డి, పూదారి రమేష్, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఎదుట పురుగుల మందుతో వ్యక్తి హల్‌చల్

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): తన పట్టా భూమిని అక్రమంగా ఆక్రమించారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి కలెక్టర్ కార్యాలయంలో పురుగుల మందు తాగేందుకు యత్నించిన ఘటన కలకలం రేపింది. మారంపల్లి నారాయణ అనే వ్యక్తి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి పురుగుల మందు డబ్బాతో హాజరై ఆత్మహత్యాయత్నం చేయడానికి ప్రయత్నించాడు. అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి అతని చేతిలోని డబ్బాను లాక్కొని ప్రమాదాన్ని నివారించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం నూకపల్లి శివారులో 30 గుంటల భూమిని కొనుగోలు చేసి హద్దులు ఏర్పాటు చేసుకున్నప్పటికీ, కొందరు హద్దులు తొలగించి భూమిని ఆక్రమించారని ఆరోపించాడు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరాడు. ఘటనపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు

**డిపార్టుమెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలు సిద్ధం**



జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సర్కిల్ పరిధిలో 14 డిపార్టుమెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను ఏర్పాటు చేసి, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్న వెంటనే సమాచారం అందితే ఈ వాహనాల ద్వారా త్వరితగతిన మరమ్మత్తులు లేదా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, స్వయంగా విద్యుత్ పరికరాలను తాకరాదని సూచించారు.



# జగిత్యాలలో కాంగ్రెస్ భవన నిర్మాణం

**టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్**

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి అవసరమైన నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ధరూర్ క్యాంపులోని సర్వే నెంబర్ 218లో కాంగ్రెస్ కార్యాలయానికి ఎకరం స్థలం ఇప్పటికే కేటాయించినట్లు చెప్పారు. కార్యాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఆయన, ప్రతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. జగిత్యాలలో స్థలం ఎంపిక పూర్తయినందున నిర్మాణానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, పీసీసీ సెక్రటరీ బండ శంకర్, పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ గుంటి జగదీశ్వర్, పీసీసీ సేవాదళ్ సెక్రటరీ ముకేశ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీని కలిసిన మెట్‌పల్లి సీఐ





మెట్‌పల్లి/జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): మెట్‌పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ కు సీఐ సురేష్ బాబు పూల మొక్కను అందజేశారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి

మేడిపెల్లి, ఏప్రిల్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం తొంబరావుపేట శివారులో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. రైలు ఢీకొనడంతో తొంబరావుపేటకు చెందిన పుల్లూరి భీమయ్య (45) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

# ఇంధన కొరత కృత్రిమం

**దోపిడీ కోసమేనంటూ జగన్ ఫైర్**

తాడేపల్లి, ఏప్రిల్ 27 (ఈవార్తలు): ఏపీలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది సహజంగా ఏర్పడిన సంక్షోభం కాదని, కూటమి నాయకులు, పెట్రోల్ బంకుల డీలర్లు కుమ్మక్కై సృష్టించిన కృత్రిమ కొరత అని సంచలన ఆరోపణలు చేశారు. సమస్య వచ్చినప్పుడు దాన్ని అనుకూలంగా మార్చుకుని దోచుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ విషయంలోనూ అదే జరుగుతోందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయనే అంచనాలతో డీలర్లు ఉద్దేశపూర్వకంగా నిల్వలను బ్లాక్ చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఈ దోపిడీ పర్వంలో వారితో కూటమి నాయకులు జతకట్టి, లబ్ధి పొందేందుకు సిద్ధమయ్యారని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలో ఎలాంటి కొరత లేనప్పుడు, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేవని, ఇది పూర్తిగా మానవ సృష్ట సంక్షోభమని జగన్ స్పష్టం చేశారు. ఈ కృత్రిమ కొరత కారణంగా అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రబీ పంటల కోతల సమయం కావడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. పంట నూర్పిడి యంత్రాలకు రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం కాగా, సరఫరా నిలిచిపోవడంతో యంత్రాలు పొలాల్లోనే ఆగిపోతున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు కోలుకోలేని నష్టాలను చవిచూస్తున్నారని వివరించారు. అలాగే, ఆక్వా రంగంలో ఏరియేటర్లు నడిపేందుకు డీజిల్ అందక రొయ్యలు, చేపల రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఒక సమగ్ర సమీక్ష కూడా నిర్వహించకుండా, కేవలం మీడియాకు లీకులిస్తూ కాలయాపన చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. సరఫరా తగ్గుతుందనే భయంతో ప్రజలే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు, యూరియా నుంచి వంట గ్యాస్ వరకు ఇలాగే కృత్రిమ కొరత సృష్టించి చంద్రబాబు లబ్ధి పొందారని, ఇప్పుడు ఆ జాబితాలో పెట్రోల్, డీజిల్‌ను చేర్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పరిస్థితిని చక్కదిద్దాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, తగిన గుణపాఠం చెబుతారని జగన్ హెచ్చరించారు.

# ఓటమితోనే గొప్ప పాఠం

**ఏయూ శతాబ్ది వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

విశాఖపట్నం, ఏప్రిల్ 27 (ఈవార్తలు): విజయం సాధించాలంటే ముందు మన అంతర్గత ఒత్తిడిని జయించాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరిలో ఉండే అంతర్గత ఒత్తిడిని అధిగమించగలిగితేనే ఏ రంగంలోనైనా రాణించగలమని స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను ఉదాహరణగా చూపుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “క్రికెట్ దేవుడిగా పిలిచే సచిన్ టెండూల్కర్ కూడా తన 100వ సెంచరీ చేయడానికి చాలా సమయం తీసుకున్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారు. కానీ, ఓపికతో, పట్టుదలతో ఆ ఒత్తిడిని జయించి తన లక్ష్యాన్ని సాధించారు. జీవితంలో గెలుపోటములు సహజం. నిజానికి విజయం కంటే ఓటములే మనకు ఎక్కువ గుణపాఠాలు నేర్పుతాయి. కాబట్టి ఓటమికి భయపడకుండా, మరింత ధైర్యంతో ముందుకు సాగాలి” అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రను, దేశానికి అందించిన సేవలను ఉపరాష్ట్రపతి కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయం వందేళ్లుగా ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిందని, ఎందరో మేధావులను దేశానికి అందించిందని గుర్తుచేశారు. ముఖ్యంగా ఈ యూనివర్సిటీ రెండో ఉపకులపతిగా పనిచేసి, ఆ తర్వాత భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మేధోసంపత్తిని, నైతిక స్పష్టతను స్మరించుకున్నారు. విద్య ద్వారా మేధస్సుతో పాటు వ్యక్తిత్వాన్ని కూడా పెంపొందించాలన్న ఆయన ఆశయం నేటికీ ఆదర్శనీయమన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాద ముఖ్యం

**జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల, ఏప్రిల్ 27 (ఈవార్తలు): బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది ఆర్జీదారులతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వినతులను స్వీకరించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించాలని అధికారులను ఆదేశించారు. చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారుల్లో నమ్మకం పెంపొందించాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

# అమెరికాలో ఆకాశాన్నంటిన ధరలు

## నిత్యావసరాల ధరలతో ప్రజల ఇబ్బందులు.. కొత్త టారిఫ్‌లు, పెరిగిన ఇంధన ధరలే కారణం

వాషింగ్టన్: అమెరికాలో సామాన్య ప్రజలు నిత్యావసరాల ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిరాణా సరుకులు, గ్యాసోలిన్ (పెట్రోల్), విద్యుత్ వంటి యుటిలిటీ బిల్లుల ధరలు ఆకాశాన్నంటడంతో వారి జీవనం కష్టతరంగా మారింది. అమెరికా ప్రభుత్వం కొత్తగా విధించిన టారిఫ్‌లు, మరోవైపు పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఇంధన ధరలు.. ఈ రెండు అంశాలు కలిసి సామాన్యుడిపై పెను భారం మోపుతున్నాయని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్థిక వృద్ధికి సైతం గండికొట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ ధరల పెరుగుదల ప్రభావం తమపై ఎలా ఉందో కొందరు అమెరికన్లు జిన్హువా న్యూస్ ఏజెన్సీతో పంచుకున్నారు. "నమ్మకద్రోహంగా అనిపిస్తోంది. మా జీవితాలు బాగు చేస్తారని ట్రంప్‌కు ఓటేశాను" అని కాలిఫోర్నియాకు చెందిన 66 ఏళ్ల కేటీ పెర్యే ఆవేదన



వ్యక్తం చేశారు. కనీస వేతనంతో పనిచేస్తున్న ఆమె, తన మనవడితో కలిసి జీవిస్తున్నారు. ట్రంప్ అధికారంలోకి రాకముందు తన నెలవారీ ఖర్చులు 2,300 డాలర్లు (రూ. 2,16,704) ఉండేవని, ఇప్పుడు అవి 2,500 డాలర్లు (రూ. 2,35,548) దాటాయని, దీంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారిందని ఆమె వాపోయారు. లాస్ ఏంజెలెస్‌కు చెందిన 34 ఏళ్ల క్రిస్టియన్ డెవిటో కూడా ఇదే రకమైన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు నెలల్లో తన నెలవారీ బిల్లులు 15 శాతం పెరిగాయని తెలిపారు. "ప్రయాణ ఖర్చులు వారానికి 50 నుంచి 70 డాలర్లకి పెరిగాయి. ఇప్పుడు ఆహారం కూడా తగ్గించుకోవాల్సి వస్తోంది" అని ఆయన అన్నారు. ప్రభుత్వ గణాంకాలు కూడా ఈ ఆందోళనలను బలపరుస్తున్నాయి. యూఎస్ బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ ప్రకారం మార్చిలో ఇంధన ధరలు 10.9% పెరగ్గా, గ్యాసోలిన్ ధరలు ఏకంగా 21.2% పెరిగాయి. టారిఫ్‌ల వల్ల వినియోగదారులపై పడే భారం దాదాపు సమానంగా ఉంటుందని ఫెడరల్ రిజర్వ్ పరిశోధనలో తేలింది. పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం కెనడా, మెక్సికో, చైనా నుంచి దిగుమతులపై విధించిన టారిఫ్‌ల వల్ల సగటు అమెరికన్ కుటుంబంపై ఏటా 1200 డాలర్ల (రూ. 1,13,063) అదనపు భారం పడుతుంది. ధరల ఒత్తిడి కొనసాగితే, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి వడ్డీ రేట్లను ఎక్కువ కాలం పాటు అధికంగానే ఉంచుతామని ఫెడరల్ రిజర్వ్ ఇప్పటికే సంకేతాలిచ్చింది. ఇది క్రెడిట్ కార్డులు, ఆటో లోన్‌లపై భారాన్ని మరింత పెంచుతుంది. "త్వరలోనే మంచి వార్త వస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి మరో ఏడాదిని మేము తట్టుకోలేము" అని కేటీ పెర్యే తన నిస్సహాయతను వ్యక్తం చేశారు.

# భారతీయులున్న ట్యాంకర్‌పై ఇరాన్ కాల్పులు

**ఒమన్ తీరంలో రసాయన ట్యాంకర్‌పై దాడి**

**ధ్రువీకరించిన భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ**

టెహ్రాన్: పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒమన్‌లోని షినాస్ ఓడరేవు సమీపంలో భారతీయ నావికులున్న ఒక రసాయన ట్యాంకర్‌పై ఇరాన్ కోస్ట్ గార్డ్ కాల్పులు జరిపినట్లు భారత ఓడరేవులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. టోగో దేశ జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంటీ సైరన్' అనే ఈ ట్యాంకర్‌లోకి కొందరు వ్యక్తులు ప్రవేశించినట్లు తెలిపింది. ఏప్రిల్ 25న ఈ ఘటన జరిగిందని, ఆ సమయంలో ఆ నౌక సమీపంలో ఇతర నౌకలు కూడా ఉన్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మందీప్ సింగ్ రణధావా తెలిపారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఇరాన్ కోస్ట్ గార్డ్



హెచ్చరికగా ఈ కాల్పులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భారత నావికుల భద్రత, నౌకల కార్యకలాపాల కొనసాగింపు కోసం విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో కలిసి నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని రణధావా వివరించారు. డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ ఇప్పటివరకు 7,780 కాల్స్, 16,650 ఈమెయిల్లను స్వీకరించిందని, 2,770 భారత నౌకలతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. "ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో ఇరాన్ నుంచి ఇటువంటి దాడులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్ 22న భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న ఒక నౌకపై, అలాగే ఏప్రిల్ 18న హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు భారత నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలపై భారత్ అప్పట్లోనే ఇరాన్‌కు తీవ్ర నిరసన తెలిపింది. అయితే, అనుమతి లేకుండా తమ జలాల్లోకి ప్రవేశించడం వల్లే దాడి చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ నేవీ (ఐఆర్జీసీ-ఎన్) ప్రకటించింది.

# యుద్ధం ఆపి, జలసంధి తెరుస్తాం

**అమెరికాకు ఇరాన్ కొత్త ప్రతిపాదన**

టెహ్రాన్: అమెరికాతో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు ఇరాన్ ఒక కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. యుద్ధాన్ని ముగించి, కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అయితే అణు సంబంధిత చర్చలను మాత్రం ప్రస్తుతానికి వాయిదా వేయాలని ఆ ప్రతిపాదనలో కోరినట్టు అమెరికా మీడియా సంస్థ 'యాక్సియోస్' తన కథనంలో పేర్కొంది. ఓ అమెరికా అధికారి, చర్చల గురించి తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఉటంకిస్తూ ఈ వివరాలను వెల్లడించింది. చర్చల్లో నిలిచిపోయిన పరిస్థితిని అధిగమించడంతో పాటు, అణు రాయితీల పరిధిపై ఇరాన్ నాయకత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ముందుకు సాగే వ్యూహంలో




భాగంగానే ఇరాన్ ఈ ప్రతిపాదన చేసిందని యాక్సియోస్ తెలిపింది. అయితే, ఈ ప్రతిపాదనకు అమెరికా అంగీకరిస్తే భవిష్యత్తు చర్చల్లో ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం అధ్యక్షుడు ట్రంప్ కోల్పోతారని నివేదిక విశ్లేషించింది. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తొలగించడం, యురేనియం శుద్ధిని శాశ్వతంగా నిలిపివేయించడమే ట్రంప్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన జాతీయ భద్రతా, విదేశాంగ విధాన బృందంతో సోమవారం సిట్యుయేషన్ రూమ్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ముగ్గురు అధికారులు వెల్లడించారు. చర్చల్లో ప్రతిష్టంభన, తదుపరి చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామనే సంకేతాలు ఇచ్చారు. చమురు ఎగుమతులను అడ్డుకోవడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ కొత్త ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# భర్త సోదరినే రెండో భార్యగా చూపి విడాకులు

**మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో మహిళ నిర్వాకం**

**విషయం తెలిసి హైకోర్టును ఆశ్రయించిన భర్త**

గ్వాలియర్: విడాకులు పొందేందుకు ఓ భార్య వేసిన పక్కా ప్లాన్ కోర్టునే విస్మయానికి గురిచేసింది. ఏకంగా తన భర్త సొంత చెల్లెలినే అతడి రెండో భార్యగా చిత్రీకరించి, ఫ్యామిలీ కోర్టును తప్పుదోవ పట్టించి ఏకపక్షంగా విడాకులు పొందింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన ఈ విచిత్ర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలు విషయం తెలుసుకున్న భర్త, తనకు అన్యాయంగా మంజూరు చేసిన విడాకులను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. గ్వాలియర్‌కు చెందిన 40 ఏళ్ల మహిళకు 1998లో వివాహం జరిగింది. మార్కెటింగ్ కంపెనీలో పనిచేసే భర్త ఉద్యోగరీత్యా తరచూ బయట ప్రాంతాలకు వెళ్లేవాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో 2015 నుంచి ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. అయితే, విడాకులు ఇచ్చేందుకు భర్త నిరాకరించాడు. దీంతో 2021లో సదరు మహిళ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన భర్త మరో పెళ్లి చేసుకున్నాడని, అందుకే తనకు విడాకులు కావాలని పిటిషన్ వేసింది. ఇందుకు సాక్ష్యంగా భర్త తన సోదరి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి దిగిన ఓ ఫ్యామిలీ ఫొటోను కోర్టుకు సమర్పించింది. అందులో ఉన్న తన ఆడపడుచునే భర్త రెండో భార్యగా చెప్పి కోర్టును నమ్మించింది. ఆమె సమర్పించిన ఆధారాలపై ఆధారపడిన ఫ్యామిలీ కోర్టు, ఆమెకు అనుకూలంగా ఏకపక్ష విడాకుల డిక్రీని మంజూరు చేసింది. ఈ నెల ఏప్రిల్ మొదటి వారంలో ఈ విషయం తెలుసుకున్న భర్త షాక్‌కు గురయ్యాడు. కోర్టు రికార్డులను పరిశీలించగా, తన భార్య చేసిన మోసం బయటపడింది. దీంతో ఆమె కోర్టును తప్పుదోవ పట్టించి అక్రమంగా విడాకులు పొందిందని ఆరోపిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన గ్వాలియర్ బెంచ్ లో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసు త్వరలో విచారణకు రానుంది.

# కాంగ్రెస్‌లో చేరడమే అతి పెద్ద రిస్క్:

**యువతి సమాధానంతో రాహుల్ అవాక్కు**

ఢిల్లీ: మీ జీవితంలో మీరు చేసిన అత్యంత రిస్కీ పని ఏమిటి? అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించగా, ఓ విద్యార్థిని నుంచి ఊహించని సమాధానం వచ్చింది. దీనితో అక్కడ కొన్ని క్షణాలు నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఢిల్లీ యూనివర్సిటీ, గార్గీ కాలేజీలకు చెందిన విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఆ సమయంలో "మీరు చేసిన అత్యంత సాహసోపేతమైన పని ఏమిటి?" అని విద్యార్థినులను రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అక్కడున్న వారిలో ఒక విద్యార్థిని స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీలో చేరడం అత్యంత సాహసోపేతమైనదని పేర్కొన్నారు. ఈ సమాధానంతో రాహుల్ గాంధీ కూడా నవ్వేశారు. "అవును, అది నిజంగా సాహసోపేతమైనదే" అంటూ బదులిచ్చారు. దీంతో రాహుల్ గాంధీతో పాటు విద్యార్థినులందరూ సరదాగా నవ్వారు. రాహుల్ గాంధీ యువ ఓటర్లతో మమేకవ్వడానికి ప్రయత్నిస్తున్నారు.



# స్టాక్ మార్కెట్లకు భారీ లాభాలు

ముంబై: దేశీయ, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు వెల్లువెత్తడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. భారత్-న్యూజిలాండ్ మధ్య కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ) ఖరారు కావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 639.42 పాయింట్లు లాభపడి 77,303.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 194.75 పాయింట్లు పెరిగి 24,092.70 వద్ద ముగిసింది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి టాడ్ మెక్‌క్లే సమక్షంలో ఢిల్లీలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీని ప్రకారం, భారత్ నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లే 100 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా రద్దవుతాయి. అదేవిధంగా, న్యూజిలాండ్ నుంచి వచ్చే 95 శాతం దిగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చనే వార్తలు కూడా మార్కెట్లకు ఊతమిచ్చాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసినట్లు వచ్చిన నివేదికలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. సెన్సెక్స్-30 షేర్లలో అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్ ప్రధానంగా లాభపడగా, యాక్సిస్ బ్యాంక్, బీఈఎల్, ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్ 1.55 శాతం, స్మాల్‌క్యాప్ 1.96 శాతం మేర లాభపడి బెంచ్‌మార్క్ సూచీలను మించి రాణించాయి. రంగాలవారీగా చూస్తే ఫార్మా, రియల్టీ, ఐటీ సూచీలు లాభపడగా, ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ వెనుకబడ్డాయి. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 24,300-24,400 స్థాయిల్లో కీలక నిరోధం ఎదురుకావచ్చు. తక్షణ మద్దతు 23,900 వద్ద ఉందని, ఈ స్థాయిని కోల్పోతే 23,800 వరకు దిగివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 0.07 శాతం బలపడి 94.16 వద్ద ట్రేడ్ అయింది.

# సహజీవనం చేసి లైంగికదాడి అంటే ఎలా?

న్యూఢిల్లీ: పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, నేరపూరిత లైంగిక నేరాలకు మధ్య తేడాను కోర్టు నొక్కి చెప్పింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై సదరు మహిళ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ పిటిషన్ వేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు సహజీవనానికి సంబంధించినదని, వివాహం కాకుండానే మహిళ బిడ్డకు కూడా జన్మనిచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోందని అన్నారు. సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారిందని ప్రశ్నించారు. వివాహ ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవేనని, కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేయడమేమిటని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ, నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయస్సు పద్దెనిమిది అని, అప్పుడు ఆమె ఒక వితంతువు అని కోర్టుకు తెలిపారు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిపోయిందని, కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. ఇతర మహిళలను కూడా అతడు ఇలాగే మోసం చేశాడని అన్నారు. అయితే, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులు కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించిందని ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం లైంగిక దాడి కాదని స్పష్టం చేశారు. అలాగే మహిళ పరిస్థితిపై న్యాయమూర్తి సానుభూతి వ్యక్తం చేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

# శాంతిపునరుద్ధరణకు కృషి చేస్తాం: పుతిన్

సెయింట్ పీటర్స్‌బర్గ్: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. పశ్చిమాసియాలో తమకు సాధ్యమైనంత వరకు శాంతిపునరుద్ధరణ కోసం ప్రతిదీ చేస్తామని అన్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమాసియా ప్రాంతంలో త్వరగా శాంతి నెలకొనేలా చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ ప్రాంత ప్రజలందరి ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రతిదీ చేస్తామని అరాఘ్చీతో పుతిన్ చెప్పినట్లు రష్యా ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరాఘ్చీ రష్యా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. రష్యా, ఇరాన్ మధ్య సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని అన్నారు. ఇవి మరింతగా బలోపేతమవుతున్నట్లు పేర్కొన్నారు. పుతిన్‌తో వేదిక పంచుకోవడానికి ముందు అరాఘ్చీ మాట్లాడారు. ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, యుద్ధం ముగింపునకు చర్చలు విఫలమవ్వడానికి అమెరికాయే కారణమని ఆరోపించారు.

# అకోలాలో 46.9 డిగ్రీలు

**దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత**

అకోలా: మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో దేశంలోనే అత్యధికంగా 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పూర్, విదర్భలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు వీచాయి. ఈ సంవత్సరం మార్చి నెల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటాయి. దీనితో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఈ వారం మొత్తం దేశంలోని అనేక ప్రాంతాల్లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నాగ్‌పూర్‌లోని వాతావరణ శాఖ తెలిపింది. ఈ సంవత్సరం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల వరకు చేరుకోవచ్చని, కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం దేశంలోనే అత్యధికంగా అకోలాలో 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది. అమరావతి (మహారాష్ట్ర)లో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది. వాతావరణ శాఖ డేటా ప్రకారం, వార్ధాలో 46.4 డిగ్రీలు, యవత్మాల్‌లో 46 డిగ్రీలు, నాగ్‌పూర్‌లో 45.4 డిగ్రీలు, చంద్రాపూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విదర్భ ప్రాంతంలో తీవ్రమైన వడగాలులు వీచాయని తెలిపింది. ఈ ప్రాంతంలో మంగళవారం వరకు ఈ వడగాలుల ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకూడదని అధికారులు సూచించారు.

# పాక్‌లో లష్కరే అగ్ర కమాండర్ హతం

**అజ్ఞాత వ్యక్తుల చేతుల్లో వరుస ఘటనలు**

ఇస్లామాబాద్: లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడు, ఆ సంస్థ అగ్ర కమాండర్ షేక్ యూనస్ అఫ్రిదీ పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో గుర్తుతెలియని దుండగుల చేతిలో హతమయ్యాడు. అతి సమీపం నుంచి దుండగులు జరిపిన కాల్పుల్లో అఫ్రిదీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గత కొంతకాలంగా పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న కీలక ఉగ్రవాదులే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. గత నెలలో లాహోర్‌లో లష్కరే వ్యవస్థాపక సభ్యుడు అమీర్ హమ్జాపై దాడి జరగ్గా, ఆయన తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ముంబై 26/11 దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు రైట్ హ్యాండ్ లాంటి అబు ఖతల్ (ఖతల్ సింధీ) కూడా గత ఏడాది ఇదే తరహాలో హతమయ్యాడు. గడిచిన కొన్ని నెలల్లోనే లష్కరే, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థలకు చెందిన కనీసం 30 మంది కీలక ఉగ్రవాదులు లాహోర్, కరాచీ వీధుల్లో అజ్ఞాత వ్యక్తుల చేతిలో హతమయ్యారు. జైషే మహమ్మద్ అధిపతి మౌలానా మసూద్ అజార్ సోదరుడు తాహిర్ అన్వర్ కూడా ఇటీవల అనుమానాస్పద స్థితిలో మరణించడం గమనార్హం.

# వేసవిలో జేబులో ఉల్లిపాయ: జ్యోతిరాదిత్య

శివపురి: తాను కారులో లేదా ఇతర చోట్ల ఏసీని ఉపయోగించనని, జేబులో ఉల్లిపాయ పెట్టుకుంటానని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. వేసవికాలంలో అందరూ జేబులో ఉల్లిపాయ పెట్టుకోవాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లోని శివపురిలో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, ఎండవేడిని తట్టుకోవడానికి తాను ప్రాచీన భారతీయ పద్ధతిని పాటిస్తానని అన్నారు. తలను కప్పుకోవడం, జేబులో ఉల్లిపాయ ఉంచుకోవడం చేస్తానని అన్నారు. ప్రజలు ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి ఈ విషయాలను గమనించాలని సూచించారు. కారులో ఏసీ ఉపయోగించనని, అలాగే ఏసీ ఉన్నచోట కూర్చోనని తెలిపారు. మే, జూన్ నెలల్లో 51 డిగ్రీల వేడిలో కూడా ప్రజలు తనను అడిగితే, 'ఇది చంబల్ చర్మం అని చెబుతానని అన్నారు. ఇంకో విషయం కూడా చెబుతున్నానని, తాను చూడటానికి కొంచెం చిన్నవాడిలా కనిపిస్తానని, కానీ తన ఆత్మ చాలా పురాతనమైనదని అన్నారు.

# యూఏఈకి ఇజ్రాయెల్ ఐరన్ డోమ్

దుబాయ్: ఇరాన్‌తో యుద్ధం జరుగుతున్న తరుణంలో, ఇజ్రాయెల్ తన ప్రధాన రక్షణ వ్యవస్థ ఐరన్ డ్రోమ్ వ్యవస్థను మొదటిసారి విదేశాలకు పంపించింది. ఐరన్ డోమ్ వ్యవస్థతో పాటు సైనిక సిబ్బందిని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి పంపించింది. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఇతర ఆస్తులపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఇందులో భాగంగా యూఏఈపై నిరంతర క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తోంది. ఇరాన్ దాడులను యూఏఈ తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకుంది. కానీ కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యూఏఈ మిత్ర దేశాల సాయం కోరింది. దీనితో ఇజ్రాయెల్ తన ఐరన్ డోమ్ వ్యవస్థను యూఏఈకి పంపించింది. దానిని ఆపరేట్ చేసి రాకెట్లు, డ్రోన్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా పంపించింది. ఇరాన్ దాడులు పెరగడంతో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయేద్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు ఫోన్ చేశారు. ఆ తర్వాత ఐరన్ డోమ్ వ్యవస్థను యూఏఈకి తరలించాలని ఆదేశాలు వెళ్లాయి. దీనితో ఇరాన్‌కు ప్రధాన టార్గెట్‌గా మారిన అబుదాబికి భారీ ఊరట లభించింది. దీనితో ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులను యూఏఈ ఈ ఐరన్ డోమ్ సహాయంతో అడ్డుకుంటోంది.

# ఎంబీఏ విద్యార్థినిపై కిరాణా వ్యాపారి అత్యాచారం

భువనేశ్వర్: భువనేశ్వర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఎంబీఏ చదువుతున్న ఓ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కిరాణా దుకాణదారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి స్థానికంగా ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. శుక్రవారం రాత్రి ఆమె రూమ్‌మేట్ ఊర్లో లేని సమయంలో ఈ ఘటన జరిగింది. బాధితురాలు దగ్గరలోని కిరాణా షాపు నుంచి కొన్ని సరుకులు ఆర్డర్ చేసింది. సరుకులు డెలివరీ చేసేందుకు వచ్చిన నిందితుడు ఇంట్లో ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలు శనివారం ఇన్ఫో వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 64(1), 62 కింద కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర పక్కా ఆధారాలు సేకరించిన తర్వాత నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేశారు. బాధితురాలి వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ ముందు నమోదు చేసి, వైద్య పరీక్షలు కూడా పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# అమెరికా ఒకటి.. మేం నాలుగు

టెహ్రాన్: శత్రువులు తమ ఒక్క చమురు బావిపై దాడి చేస్తే తాము నాలుగు చమురు బావులపై దాడులు చేస్తామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. మూడు రోజుల్లో ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చమురు పైప్‌లైన్లను పేల్చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సాహెబ్ ఇస్ఫహానీ స్పందించారు. చమురు క్షేత్రాలు సహా తమ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులకు పాల్పడితే అమెరికాకు మద్దతిచ్చే దేశాల్లో దానికి నాలుగు రెట్లు ఎక్కువ విధ్వంసానికి పాల్పడుతామని ఆయన హెచ్చరించారు. తమ లెక్కలు అందరిలా కాకుండా భిన్నంగా ఉంటాయని వ్యాఖ్యానించారు. శత్రువులు ఒక్క చమురు బావిపై దాడి చేస్తే తాము నాలుగింటిపై దాడి చేస్తామని అన్నారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఆస్తులను ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు. ట్రంప్ నిన్న ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే టెహ్రాన్‌లోని చమురు పైపులైన్‌లను పేల్చేస్తామని హెచ్చరించారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
మంగళవారం 28-4-2026, జగిత్యాల
www.evarthalu.com


లవ్లీ చిత్రం





## కింగ్ 100లో టబు

### 28 ఏళ్ల తర్వాత హిట్ జోడీ రిపీట్



నాగార్జున 100వ సినిమాలో టబు కన్ఫర్మ్ అయ్యింది. ఈ సినిమాలో తాను నటిస్తున్నట్లు స్వయంగా టబునే ప్రకటించారు. ఈ మేరకు మూవీ క్లాప్‌బోర్డును సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సినిమాకి సంబంధించి ఇదే తొలి ప్రకటన. చిత్ర బృందం ఏ విషయాన్నీ బయటకు రానివ్వకపోవడం గమనార్హం. నటి పోస్టుపై ఈ మూవీ డైరెక్టర్ సహా పలువురు సినీ ప్రముఖులు స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. 'మేడమ్.. మీతో కలిసి పని చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అంటూ టబు పోస్టుకు రిప్లై ఇచ్చారు డైరెక్టర్ కార్తీక్. 'కింగ్ 100' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా గతేడాది అక్టోబరులోనే ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యాక్షన్ ప్రధానంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నాగార్జున చాలా కొత్తగా కనిపిస్తారని సమాచారం. కెరీర్ ప్రారంభం నుంచి కొత్త ప్రతిభను నమ్మి సినిమాలు చేయడంలో ముందుండే నాగార్జున.. మైలు రాయిలాంటి చిత్రాన్నీ తెరకెక్కించే అవకాశం యువ దర్శకుడికే ఇవ్వడం విశేషం. 'నిన్నే పెళ్లాడతా'తో హిట్ పెయిర్‌గా నిలిచారు నాగార్జున- టబు. తర్వాత 'ఆవిడా మా ఆవిడే'లో నటించారు. దాదాపు 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు కలిసి నటిస్తున్నారు. మరి, ఈ సినిమాలో టబు.. నాగ్ సరసన నటిస్తున్నారా? వేరే ఏదైనా కీలక పాత్ర పోషిస్తున్నారా? తెలియాలంటే కొంతకాలం వేచి చూడాల్సిందే. ఇందులో ముగ్గురు హీరోయిన్లకు అవకాశం ఉందని టాక్.

## 23 సార్లు చిరును కొట్టా: రాధిక

మెగాస్టార్ చిరంజీవి – రాధికాలది ప్రత్యేకమైన జోడీ. ఇద్దరు కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. వ్యక్తిగతంగానూ మంచి స్నేహితులు. తాజాగా రాధిక కెరీర్ ప్రారంభంలో చోటు చేసుకున్న ఓ ఆసక్తికర సంఘటనను గుర్తు చేసు కున్నారు. న్యాయం కావాలి సినిమా షూటింగ్ సమయంలో ఓ సన్నివేశం కోసం రాధిక చిరంజీవిని ఏకంగా 23 సార్లు చెంపదెబ్బలు కొట్టాల్సి వచ్చిందన్నారు. ఆ సన్నివేశం వివరాల్లోకి వెళ్తే కథా పరంగా రాధిక పాత్ర చిరంజీవిని కొట్టాల్సి ఉ ంటుంది. అయితే ఆ సీన్ పర్ఫెక్ట్‌గా రావాలని దర్శకుడు పదే పదే రీటేక్‌లు తీసుకున్నారట. దాంతో రాధిక



దాదాపు 23 సార్లు చిరంజీవి చెంపపై కొట్టారు. ఆ దెబ్బల ధాటికి మెగాస్టార్ చెంపలు ఎర్రబడిపోయాయట. అనంతరం షూటింగ్ విరామ సమయంలో చిరంజీవి దగ్గరకు వెళ్లి రాధిక క్షమాపణలు కూడా కోరారని తెలిపారు. వృత్తి పట్ల చిరంజీవికి ఉన్న అంకితభావం అప్పట్లోనే అందరినీ ఆశ్చర్యపరిచేదని కొనియాడారు. చిరంజీవి ఎంతటి అగ్ర నటులైనా తోటి నటీనటులతో ఎంతో సరదాగా ఉంటారని వెల్లడించారు. షూటింగ్ సమయంలో జరిగిన ఇలాంటి కష్టమైన అనుభవాలను కూడా చిరంజీవి ఎంతో హుందాగా స్వీకరించే వారన్నారు. 23 సార్లు కొట్టినా కోపం తెచ్చుకోలేదు. సీన్ బాగా రావాలని ప్రోత్సహించారని రాధిక చెప్పుకొచ్చారు. ఈ ఘటన జరిగిన నాటి నుండి నేటి వరకు ఇద్దరి మధ్య స్నేహం మరింత బలపడింది తప్ప ఏనాడూ తగ్గలేదన్నారు.



## అషు రెడ్డి బ్లాక్ మెయిల్

టాలీవుడ్ నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డి చుట్టూ అల్లుకున్న 'హనీ ట్రాప్' ఆరోపణల ఉదంతం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోంది. అషు గురించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర పలు సంచలన విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా తాను ఇచ్చిన డబ్బును అడిగినప్పుడల్లా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేందని ఆయన కీలక విషయానని తెలియజేశారు. పెళ్లి చేసుకుంటాననే సాకుతో అషు రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులు తనను నిలువునా ముంచారని ధర్మేంద్ర ఆరోపించారు. 2018 నుంచి 2025 వరకు సాగిన ఈ వ్యవహారంలో ఆస్తులు, నగదు రూపంలో సుమారు రూ. 9.35 కోట్లు కాజేసినట్లు పోలీసుల ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. ప్రారంభంలో తన ఎడ్యుకేషన్ లోన్, వీసా సమస్యలు, సినీ కెరీర్ ఖర్చుల పేరుతో అషు రెడ్డి తన నుంచి భారీగా డబ్బు తీసుకున్నట్లు ధర్మేంద్ర తెలిపారు. ధర్మేంద్ర ఇచ్చిన డబ్బుతో అషు రెడ్డి మణికొండలో ఒక ఫ్లాట్ (రూ. 1.80 కోట్ల అడ్వాన్స్), సుమారు 5 కిలోల బంగారం, ఖరీదైన కార్లు కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు తిరిగి అడిగినప్పుడల్లా తాను ఆత్మహత్య చేసుకుంటానని అషు రెడ్డి బెదిరించేదని, గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేసిందని బాధితుడు వెల్లడించారు. ఈ ఆరోపణలను అషు రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఖండించారు. తనపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు.

## ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో సాయి పల్లవే

భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన గాన కోకిల ఎం.ఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌పై ఇండస్ట్రీలో మళ్లీ చర్చలు వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఫైనల్ చేసినట్టు వస్తున్న సమాచారం ఇప్పుడు సినీ వర్గాల్లో



ఆసక్తిని రేకెత్తిస్తోంది. మధ్యలో పలు పేర్లు వినిపించినప్పటికీ, మేకర్స్ మాత్రం సాయి పల్లవిని తప్ప మరెవరినీ ఈ పాత్ర కోసం పరిగణనలోకి తీసుకోవడంలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మించనున్నారని సమాచారం. ఇటీవల ఈ బయోపిక్ నుంచి సాయి పల్లవి తప్పుకుందనే వార్తలు, అలాగే ఆమె స్థానంలో రుక్మిణి వసంత్‌ను తీసుకున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఈ వార్తలన్నింటినీ మేకర్స్ పూర్తిగా ఖండించినట్టు తెలుస్తోంది. ఎం.ఎస్ సుబ్బులక్ష్మి లాంటి గొప్ప వ్యక్తిత్వాన్ని తెరపై ప్రతిబింబించాలంటే సాయి పల్లవి లాంటి నటి అవసరమని టీమ్ గట్టిగా నమ్ముతోందట.

## పోలీస్‌గా సంయుక్త

టాలీవుడ్‌లో లేడీ ఓరియెంటెడ్ సినిమాల దిశగా మరో ఆసక్తికరమైన అడుగు పడింది. సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న హై ఓక్టేన్ యాక్షన్ డ్రామా ది బ్లాక్ గోల్డ్ ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు యోగేష్ కేఎంసీ దర్శకత్వం వహిస్తున్నారు. నిజ జీవితంలో చోటుచేసుకున్న షాకింగ్ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకోవడం విశేషం. కేవలం 60 రోజుల్లోనే మొత్తం షూటింగ్ పూర్తి చేయడం టీమ్ ప్లాన్ కు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఇటీవల చిత్రబృందం రిలీజ్ చేసిన సంయుక్త లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఆమె కనిపించిన తీరు నిజ జీవిత పోలీస్ అధికారిని గుర్తు చేసేలా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె లుక్‌లో ఉన్న సీరియస్‌నెస్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ ప్రెజెన్స్ ఇన్నవీ కలిపి ఒక పవర్‌ఫుల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నాయి. మేకింగ్ వీడియోలో కూడా ఈ పాత్ర కోసం తీసుకున్న కష్టాన్ని స్పష్టంగా చూపించారు. ప్రతి సీన్‌లో రియాలిటీకి దగ్గరగా ఉ ండేలా డైరెక్టర్ స్పెషల్ కేర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా కథ తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న బొగ్గు సిండికేట్ అక్రమ కార్యకలాపాల చుట్టూ తిరుగుతుంది.



## అల్లుకు బెల్లంకొండ ఆహ్వానం

టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఇంట్లో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. తన ప్రేయసి కావ్యారెడ్డితో కలిసి ఈ నెల 29న తిరుమల కొండపై ఆయన ఏడడుగులు వేయబోతున్నారు. ఈ సందడిలో భాగంగా బెల్లంకొండ కుటుంబం సినీ, రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తోంది. తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కలిసి వెడ్డింగ్ కార్డ్ అందించారు. ఈ సందర్భంగా దిగిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన తండ్రి సురేష్‌తో కలిసి అల్లు అర్జున్ నివాసానికి వెళ్లారు. అక్కడ బన్నీని మర్యాదపూర్వకంగా కలిసి తన పెళ్లి పత్రికను అందించారు. ఈ నెల 29న తిరుమలలో జరిగే వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా రావాలని కోరారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ సాయి శ్రీనివాస్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపి, కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్నందుకు శుభాకాంక్షలు అందించారు.





## ఎవర్నీ నిందించలేం

అసలు ఏం జరిగిందో తనకే అర్థం కావడం లేదని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. ఈ ఘోర ఓటమికి ఎవర్నీ నిందించలేనని చెప్పాడు.'ఈ మ్యాచ్‌లో ఏం జరిగిందో నాకే అర్థం కావడం లేదు. కానీ క్రికెట్‌లో ప్రతిరోజూ అప్రమత్తంగా ఉండాలి. వీలైనంత త్వరగా ఈ పరాజయాన్ని మరిచి ముందకు సాగాలి. గుజరాత్ టైటాన్స్ చేతిలో ఎదురైన పరాజయం తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ మూమెంటమ్ దెబ్బతిన్నదా? అంటే అవుననే అంటాను. అయితే క్రికెట్‌లో ఇలా జరిగితే బాగుండు, అలా జరగకపోతే బాగుండని అనిపిస్తుంది. కానీ క్రికెట్‌లో అప్రమత్తంగా ఉండటం ముఖ్యం. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడం కీలకం. ఐపీఎల్ చాలా కఠినమైన టోర్నీ. ఏ రోజూ కూడా విజయం అంత సులువుగా లభించదు. ప్రతీ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేయాల్సిందే.

### ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 7 | 6 | 0 | 12 |
| బెంగళూరు | 7 | 6 | 2 | 12 |
| హైదరాబాద్ | 8 | 5 | 3 | 10 |
| రాజస్థాన్ | 8 | 5 | 3 | 10 |
| గుజరాత్ | 8 | 4 | 4 | 8 |
| చెన్నై | 8 | 3 | 5 | 6 |
| ఢిల్లీ | 8 | 3 | 5 | 6 |
| కోల్‌కతా | 8 | 2 | 5 | 5 |
| ముంబై | 7 | 2 | 5 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు



## భువనేశ్వర్ వల్లే విన్నింగ్ ప్రదర్శన: హేజిల్‌వుడ్

భువనేశ్వర్ కుమార్ సహకారంతోనే మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేశానని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ అన్నాడు. భువనేశ్వర్ బౌలింగ్‌ను అనుసరించడంతోనే తనకు వికెట్లు దక్కాయని చెప్పాడు.'గత మ్యాచ్‌లో ఇదే వికెట్‌పై 500 ప్లస్ పరుగులు వచ్చిన తర్వాత.. ఇలాంటి పిచ్‌ని ఊహించలేదు. నేను భువనేశ్వర్ కుమార్‌ను అనుసరించాను అంతే. మొదటి ఆరు ఓవర్లలో పిచ్ నుంచి బౌలర్లకు అడ్వాంటేజ్ లభించింది. బంతి అటు ఇటుగా వచ్చింది. బంతి పాతబడిన తర్వాత బ్యాటింగ్‌కు ఈజీ అయ్యింది. బ్యాటర్లు 'వీ' జోన్‌లోకి ఆడేలా బౌలింగ్ చేయాలనుకుంటాం. కానీ ఆ ఏరియాలో పిచ్‌లో ఏదో ఉందనిపించింది. బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకోవడం మాకు కలిసొచ్చింది. నాలుగు ఓవర్లు వేసి త్వరగా ఫీల్డ్ వదిలి వస్తే బాగుండేది (నవ్వుతూ). కానీ మేం అన్ని విభాగాల్లో రాణిస్తున్నాం. గత ఏడాది అవే గేమ్స్‌లో కూడా కండిషన్స్‌ని బాగా అర్థం చేసుకున్నాం. ఈ టోర్నీలో సరైన సమయంలో మేం ఫామ్‌లోకి వస్తున్నాం.'అని జోష్ హేజిల్‌వుడ్ తమ ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశాడు.

# స్వింగ్ జోష్

## ఢిల్లీకి హేజిల్‌వుడ్ షాక్

### తోడుగా స్వింగ్ కింగ్ భువీ.. 75 పరుగులకే ఢిల్లీ ఆలౌట్.. 6.3 ఓవర్లలోనే ఊదేసిన ఆర్సీబీ

**ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జోరు కొనసాగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో సోమవారం న్యూఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ సంచలన బౌలింగ్ ప్రదర్శనతో 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. 6.3 ఓవరల్లోనే లక్ష్యాన్ని ఛేదించడంతో ఆర్‌సీబీ రన్‌రేట్ రెట్టింపు అయ్యింది. ఐపీఎల్ చరిత్రలోనే ఆర్‌సీబీకి ఇది రెండో అతిపెద్ద విజయం.**

**ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 16.3 ఓవర్లలో 75 పరుగులకు కుప్పకూలింది. భువనేశ్వర్ కుమార్(3/5), జోష్ హేజిల్‌వుడ్(4/12) ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించగా.. కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మ, రసిక్‌ధార్ సలామ్ తలో వికెట్ తీసారు.**

ఢిల్లీ బ్యాటర్లలో ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ పోరెల్(33 బంతుల్లో 3 ఫోర్లతో 30) టాప్ స్కోరర్‌గా నిలవగా.. డేవిడ్ మిల్లర్(19), కైల్ జెమీసన్(12) డబుల్ డిజిట్ స్కోర్ చేశారు. సాహిల్ పరఖ్(0), కేఎల్ రాహుల్(1), నితీష్ రాణా(1), సమీర్ రిజ్వీ(0), ట్రిస్టన్ స్టబ్స్(5), అక్షర్ పటేల్(0) తీవ్రంగా నిరాశపర్చారు. అనంతరం ఆర్‌సీబీ 6.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ(15 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 23 నాటౌట్), దేవదత్ పడిక్కల్(13 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34 నాటౌట్) అజేయంగా నిలవగా.. జాకోబ్ బెతెల్(11 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 20) దూకుడుగా ఆడాడు. ఢిల్లీ బౌలర్లలో కైల్ జెమీసన్(1/42) ఒక్కడే ఒక వికెట్ తీయగా.. మిగతా బౌలర్లు విఫలమయ్యారు.



#### ఢిల్లీ కొంపముంచిన పవర్ ప్లే..


బ్యాటింగ్ పవర్ ప్లేలోనే ఢిల్లీ ఓటమికి తలవంచింది. భువ స్వింగ్, హాజెల్‌వుడ్ లైన్ అండ్ లెంగ్త్‌కు చేతులెత్తేసింది. పవర్ ప్లేలోనే 6 వికెట్లు కోల్పోవడంతో కోలుకోలేకపోయింది. పిచ్ మరీ దారుణంగా లేకపోయినా.. ఢిల్లీ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరి మూల్యం చెల్లించుకున్నారు. పవర్ ప్లేలో వికెట్లు కోల్పోకుండా ఉండే ఈ మ్యాచ్ ఫలితం మరోలా ఉండేది. భువనేశ్వర్ కుమార్ సైతం ఇదే విషయాన్ని వెల్లడించాడు. పిచ్ మరీ బౌలింగ్‌కు అనుకూలంగా లేదని, బ్యాట్‌పైకి బంతి ముద్దుగా వచ్చిందని చెప్పాడు. స్వింగ్ ఉండటంతో దాన్ని సద్వినియోగం చేసుకున్నామని చెప్పాడు. ఆరంభంలో వికెట్లు దక్కడం తమ విజయానికి కలిసొచ్చిందన్నాడు.

#### 8 పరుగులు.. 6 వికెట్లు

భువనేశ్వర్ కుమార్, జోష్ హాజెల్‌వుడ్ నిప్పులు చెరిగారు. 16 బంతుల వ్యవధిలోనే 5 వికెట్లు పడగొట్టి ఢిల్లీ క్యాపిటల్స్ టాపార్డర్‌ను కుప్పకూల్చారు. ఆ తర్వాత మరో వికెట్ కూడా పడగొట్టడంతో ఢిల్లీ క్యాపిటల్స్ 8 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. పిచ్ నుంచి సహకారం లభించడంతో భువనేశ్వర్ కుమార్, జోష్ హాజెల్‌వుడ్ రఫ్ఫాడించారు. స్వింగ్ బౌలింగ్‌తో భువనేశ్వర్ కుమార్ బంతిని నాగినీ డ్యాన్స్ ఆడించగా.. హాజెల్ వుడ్ తన బౌన్స్‌తో ఢిల్లీ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టాడు. ఈ ఇద్దరి ధాటికి సాహిల్ పరఖ్(0), కేఎల్ రాహుల్(1), నితీష్ రాణా(1), సమీర్ రిజ్వీ(0), ట్రిస్టన్ స్టబ్స్(5), అక్షర్ పటేల్(0) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. దాంతో ఢిల్లీ క్యాపిటల్స్ 8 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే బౌలింగ్ ఎంచుకుంది. ఈ నిర్ణయానికి తగ్గట్లు ఆర్‌సీబీ బౌలర్లు నిప్పులు చెరిగి అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అటు.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యల్ప పవర్ ప్లే స్కోర్ నమోదు చేసిన జట్టుగా ఢిల్లీ క్యాపిటల్స్ చెత్త రికార్డ్ నమోదు చేసింది. ఆర్‌సీబీ బౌలర్ల ధాటికి పవర్ ప్లేలో 6 వికెట్లకు ఢిల్లీ 13 పరుగులే చేసింది. ఈ పవర్ ప్లేలో ఢిల్లీ ఒకే ఒక్క బౌండరీ బాదడం గమనార్హం. ఈ క్రమంలోనే రాజస్థాన్ రాయల్స్ పేరిట ఉన్న లోయెస్ట్ పవర్ ప్లే చెత్త రికార్డ్‌ను ఢిల్లీ అధిగమించింది.

## భువీ, జోష్ గెలిపించారు

తమ పేసర్లు భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ అద్వితీయమైన బౌలింగ్ ప్రదర్శనతో విజయం సాధించామని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ అన్నాడు. పిచ్‌పై స్వింగ్ మాములుగానే ఉందని, భువీ, హేజిల్‌వుడ్ సరైన లెంగ్త్‌ల్లో బౌలింగ్ చేసి వికెట్లు తీసారని, ఈ గెలుపు క్రెడిట్ వారిదేనని స్పష్టం చేశాడు. 'ఈ పిచ్ స్పందించిన తీరు చూసి నేను కూడా ఆశ్చర్యపోయాను. ఈ గెలుపు క్రెడిట్ అంతా మా బౌలర్లు భువీ, హేజిల్‌వుడ్‌లకే దక్కుతుంది. వారు సరైన లెంగ్త్‌ల్లో బౌలింగ్ చేశారు. వికెట్‌పై స్వింగ్ మామూలుగానే ఉంది.



కానీ ఆరంభంలోనే వికెట్లు తీయడం మాకు కలిసొచ్చింది. సుయాష్ బౌలింగ్ చేసిన తీరు.. స్టంప్ టు స్టంప్ లైన్ చాలా బాగుంది. బౌలర్లు వారి రొటీన్‌లను అనుసరించడం చాలా ముఖ్యం. మేం ప్రతి మ్యాచ్‌ను విడివిడిగా చూస్తున్నాం. వేర్వేరు ఆటగాళ్లు ముందుకు వచ్చి బాగా రాణిస్తున్నారు. టీ20 క్రికెట్‌లో ఫ్లాట్ పిచ్‌లపై బౌలింగ్ చేయడం చాలా ముఖ్యం. ఎందుకంటే బౌలర్లు మాత్రమే టైటిళ్లు గెలిపించగలరు.'అని రజత్ పాటిదార్ చెప్పుకొచ్చాడు.




## కోహ్లీ.. 9000

ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లీ పేరు సువర్ణాక్షరాలతో లిఖితమైంది. సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే 9000 పరుగులు పూర్తి చేసిన మొట్టమొదటి బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ఢిల్లీతో మ్యాచ్‌కు ముందు కోహ్లీ 9000 పరుగుల మైలురాయికి కేవలం 11 పరుగుల దూరంలో ఉన్నాడు. 76 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోహ్లీ, ఆరంభం నుంచే దూకుడుగా ఆడి ఈ ఘనతను అందుకున్నాడు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 8 సెంచరీలు, 66 అర్ధ సెంచరీలతో కోహ్లీ తన ఆధిపత్యాన్ని చాటుతున్నాడు. 2026 సీజన్‌లో కోహ్లీ భీభత్సమైన ఫామ్‌లో ఉన్నాడు. కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 54.66 సగటుతో 328 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు.

## రూ.100 ఇస్తేనే ఫొటో: వైభవ్

తనతో ఫొటో దిగేందుకు వచ్చిన ఇద్దరు పిల్లలను వైభవ్ సూర్యవంశీ ఆటపట్టించాడు. తాను ఫొటో దిగేందుకు డబ్బులు తీసుకుంటానని, ఒక్కో దానికి రూ.100 ఇవ్వాలని ఫన్నీగా అడిగారు. దీంతో ఆ పిల్లలు రూ. 200 తెచ్చామని చెప్పడంతో అక్కడ ఉన్న వారందరూ నవ్వేశారు. దీంతో వైభవ్ తాను తమాషాగా అన్నానని చెప్పి, ఫొటో దిగి పంపించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకోగా వైరల్‌గా మారింది. పిల్లాడే పిల్లలతో ఆడుతున్నాడని ఒకరంటే.. వైభవ్ సూర్యవంశీ ప్రాంక్ స్టార్‌గా మాట్లాడాడని మరొకరు కామెంట్ చేస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగిన సంగతి తెలిసిందే. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్, వరల్డ్ క్లాస్ బౌలర్ పాట్ కమిన్స్ బౌలింగ్‌లో ఫస్ట్ బాల్‌నే ఈ బుడ్డోడు సిక్సర్ బాదాడు. బుమ్రా, హాజెల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, రబడా బౌలింగ్‌లోనూ తొలి బంతిని బౌండరీకి తరలించిన బుడ్డోడు.. కమిన్స్ కూడా తన బ్యాటింగ్ రుచి చూపించాడు. వైభవ్ బ్యాటింగ్‌కు ఫిదా అయిన కమిన్స్.. తన ఫేవరేట్ ప్లేయర్ అని ప్రశంసల జల్లు కురిపించాడు. మహమ్మద్ కైఫ్ అయితే మరో 25 ఏళ్ల పాటు వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్‌ను ఏలుతాడని జోస్యం చెప్పాడు. గల్లీ క్రికెట్ ఆడినంత ఈజీగా ఐపీఎల్ ఆడుతున్నాడని కొనియాడాడు. తరానికొక్క ప్లేయర్ వైభవ్ సూర్యవంశీ అని ప్రశంసించాడు. టీమిండియా మాజీ కెప్టెన్ క్రిష్ శ్రీకాంత్ ఈ బుడ్డోడిని సచిన్ టెండూల్కర్‌తో పోల్చాడు.





## నేనేం ట్రోఫీని కాదు: ప్రీతి జింటా

ఐపీఎల్‌లో తన జట్టు పంజాబ్ కింగ్స్ విజయాలతో ఉత్సాహంగా ఉన్న నటి ప్రీతి జింటా, సోషల్ మీడియాలో ఓ అభిమాని చేసిన 'ట్రోఫీ' కామెంట్‌పై ఆసక్తికరంగా స్పందించారు. మహిళలను ట్రోఫీలుగా చూడవద్దని, వారి స్థానం గాజు అల్మారాల్లో కాదని, మనసులో అని ఆమె పేర్కొన్నారు. సోమవారం నాడు ప్రీతి జింటా ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ అభిమాని, 'ఆమే ఓ ట్రోఫీ. కాబట్టే ఆమె జట్టు ఇంతవరకు ట్రోఫీ గెలవలేదు' అనే వైరల్ ట్వీట్‌ను ప్రస్తావించారు. దీనికి ప్రీతి బదులిస్తూ, "మీ అభిమానానికి ధన్యవాదాలు. కానీ నిజం చెప్పాలంటే ఏ మహిళ కూడా తనను తాను ట్రోఫీగా భావించుకోవాలనుకోదు. ట్రోఫీలు వస్తువులు, వాటిని సొంతం చేసుకుంటారు. మహిళలు అలా కాదు. ట్రోఫీలను గాజు అల్మారాల్లో పెడతారు, మహిళల స్థానం జీవితంలో, మనసులో ఉంటుంది" అని పేర్కొన్నారు. ఇదే సెషన్‌లో తన రాబోయే సినిమాల గురించి కూడా ఆమె పంచుకున్నారు. "చాలా కాలంగా ఓ పీరియడ్ ఫిల్మ్‌లో నటించాలని ఉండేది. ఆ కోరిక 'లాహోర్ 1947' చిత్రంతో తీరింది. విద్వేషాల నడుమ వికసించిన ప్రేమకథ ఇది. నాకు ఇష్టమైన దర్శకుడు రాజ్ కుమార్ సంతోషి, నటుడు సన్నీ డియోల్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది" అని తెలిపారు. దీనితో పాటు 'వైబ్' అనే తేలికపాటి కామెడీ చిత్రంలో కూడా నటిస్తున్నట్టు చెప్పారు.

## పంత్‌ను తప్పించాలి

ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ మళ్లీ విజయాల బాట పట్టాలంటే కీలక నిర్ణయాలు తీసుకోవాలని టీమిండియా మాజీ ఓపెనర్ వసీం జాఫర్ సూచించాడు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి రిషభ్ పంత్‌ను తప్పించి ఎయిడెన్ మార్క్‌రమ్‌కు అప్పగించాలని లక్నో మేనేజ్‌మెంట్‌కు సలహా ఇచ్చాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన లక్నో ఆరు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. రూ.27 కోట్ల రికార్డ్ ధర పెట్టి కొనుగోలు చేసిన రిషభ్ పంత్ అటు బ్యాటింగ్.. ఇటు కెప్టెన్‌గానూ తడబడుతున్నాడు. లక్నో పేలవ ప్రదర్శనపై అభిమానులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తాజాగా లక్నో ప్రదర్శనపై మాట్లాడిన వసీం జాఫర్.. పంత్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని సూచించాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా కొన్ని మార్పులు చేయాలన్నాడు. 'ప్రస్తుతం లక్నో సూపర్ జెయింట్స్ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. వారి నుంచి ఏం ఆశించాలో కూడా తెలియడం లేదు. నేను ఆ జట్టు డగౌట్‌లో ఉంటే.. రిషభ్ పంత్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి మార్క్‌రమ్‌కు అప్పగించేవాడిని. మార్‌క్రమ్, మిచెల్ మార్ష్‌లతో ఓపెనింగ్ చేయించేవాడిని. మూడో స్థానంలో నికోలస్ పూరన్, నాలుగో స్థానంలో రిషభ్ పంత్, ఐదో స్థానంలో ఆయుష్ బదోని, ఆరో స్థానంలో అబ్దుల్ సమద్, ఏడో స్థానంలో ముకుల్ చౌదరిని ఆడిస్తాను. ఇది నా టాప్ 7 బ్యాటింగ్ లిస్ట్. రిషభ్ పంత్ కేవలం ఆటగాడిగా మాత్రమే ఉండాలి. అతనికి పూర్తి స్వేచ్ఛనిచ్చి మ్యాచ్‌లు గెలిపించమని కోరితే.. పంత్ నుంచి అత్యుత్తమ ప్రదర్శన వస్తుంది. కెప్టెన్సీ భారాన్ని అతనిపై మోపవద్దు. ఎయిడెన్ మార్‌క్రమ్ అద్భుతమైన కెప్టెన్. అతను సౌతాఫ్రికా జట్టును విజయవంతంగా నడిపించాడు. మానసికంగా బలంగా ఉండటంతో పాటు ప్రశాంతంగా ఉంటాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 28-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## వరుసపెట్టి ఉగ్రవాదుల హతం

పాకిస్థాన్ గడ్డపై ఆశ్రయం పొందుతున్న ఉగ్రవాదులు ఒకరి తర్వాత ఒకరు వరుసగా హతమవ్వడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో నెత్తురు పారించిన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి సంస్థలకు చెందిన కీలక నేతలు పాక్‌లోని సురక్షిత ప్రాంతాల్లోనే అంతమవ్వడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. ఒకప్పుడు భారత్‌పై దాడులు చేసి పాకిస్థాన్‌లో వీరవందనాలు అందుకున్న ఉగ్రవాదులకు ఇప్పుడు అదే దేశంలో ప్రాణరక్షణ కరువైంది. ఈ పరిణామాలు భారత నిఘా వ్యవస్థ పెరుగుతున్న సామర్థ్యానికి, పదునైన వ్యూహాలకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. గతంలో ఉగ్ర దాడులు జరిగినప్పుడు భారత్ కేవలం దౌత్యపరమైన నిరసనలకే పరిమితమయ్యేది. కానీ, ఇప్పుడు 'శత్రువును తన ఇంట్లోనే వేటాడాలి' అనే బలమైన సందేశం స్పష్టమవుతోంది. పాకిస్థాన్ వంటి శత్రు దేశంలో, ఆ దేశ సైన్యం మరియు ఐఎస్ఐ నీడలో తలదాచుకున్న ఉగ్రవాదులను ఏరిపారేయడం సామాన్యమైన విషయం కాదు. దీని వెనుక అత్యంత శక్తివంతమైన ఇన్ఫార్మర్ నెట్‌వర్క్, పక్కాగా అమలు చేయబడిన నిఘా ఆపరేషన్లు ఉన్నాయనేది విశ్లేషకుల అభిప్రాయం. ఒకవేళ ఇది భారత నిఘా సంస్థల పని అయితే, అంతర్జాతీయ వేదికలపై భారత్ తన రక్షణ కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధమని చాటిచెప్పినట్లవుతుంది. దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన పాకిస్థాన్, ఇప్పుడు అదే ఉగ్రవాదులకు రక్షణ కల్పించలేక చేతులెత్తేస్తోంది. తమ గడ్డపై జరుగుతున్న ఈ హత్యలను అడ్డుకోలేకపోవడం ఆ దేశ భద్రతా వైఫల్యాన్ని, నిఘా వైఫల్యాన్ని ఎండగడుతోంది. భారత నిఘా వ్యవస్థ ఎంత లోతుగా పాక్ సమాజంలోకి చొచ్చుకుపోయిందో ఈ వరుస హత్యలు నిరూపిస్తున్నాయి. ఉగ్రవాదుల ఏరివేత భారత్‌కు కేవలం భద్రతా పరమైన విజయమే కాదు, ఒక గొప్ప వ్యూహాత్మక విజయం కూడా. ఉగ్రవాదులకు భూమిపై ఎక్కడా నూకలు ఉండకూడదనేది భారత నిశ్చితాభిప్రాయం. పాకిస్థాన్‌లో హతమవుతున్న ప్రతి ఉగ్రవాది, భారత గడ్డపై ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు అందుతున్న న్యాయంగానే భావించాలి. ప్రత్యక్ష యుద్ధం చేయకుండానే శత్రువును బలహీనపరచడం ఒక గొప్ప యుద్ధతంత్రం. భారత నిఘా వ్యవస్థ నిశ్శబ్దంగా సాధిస్తున్న ఈ 'అదృశ్య విజయాలు' దేశ భవిష్యత్తుకు భరోసానిస్తున్నాయి. ఏది ఏమైనా, భారత వ్యతిరేక శక్తులకు ఇప్పుడు పాకిస్థాన్ సురక్షిత స్వర్గధామం కాదని తెలిపోయింది.

# విద్యార్థి.. సామాజిక సేవెక్కడ?

**జీవితాన్ని మార్చే పుస్తకాలు తగ్గిపోవడం, సమాజాన్ని చైతన్యపరిచే రచనలు అరుదవడం అనేది ఆధునిక కాలంలో స్పష్టంగా కనిపిస్తున్న సామాజిక మార్పు. 1950-1980 మధ్యకాలంలో సాహిత్యం ప్రజల జీవితాలపై సుమారు 70% వరకు ప్రభావం చూపిందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆ కాలంలో నవలలు, కవిత్వం, వ్యాసాలు వ్యక్తిత్వ వికాసానికి బలమైన సాధనాలుగా ఉండేవి. 2000 తర్వాత డిజిటల్ మాధ్యమాల పెరుగుదలతో పుస్తక పఠనం 45% వరకు తగ్గిందని అంచనాలు తెలియజేస్తున్నాయి. దీనివల్ల ఆలోచనా విధానంలో లోతు తగ్గడం కనిపిస్తోంది. సామాజిక చైతన్యం కలిగించే రచనలు తగ్గిపోవడం వలన ప్రజల్లో సామాజిక బాధ్యత భావం క్షీణించింది.**



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ప్రస్తుతం వ్యక్తిగత జీవితమే ముఖ్యమనే భావన 60% యువతలో పెరిగిందని 2022 అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గతంలో సామాజిక విలువలు, కుటుంబ బంధాలు, సమూహ జీవనం ప్రధానంగా ఉండేవి. ఇప్పుడు టెక్నాలజీ ఆధారిత జీవనం వ్యక్తులను ఒంటరితనానికి దగ్గర చేస్తోంది. సోషల్ మీడియా వినియోగం రోజుకు సగటున 3-5 గంటలు పెరిగినప్పటికీ, ప్రత్యక్ష సంబంధాలు 40% వరకు తగ్గాయి. ఇది మానవ సంబంధాల్లో దూరాన్ని పెంచుతోంది. స్నేహం, పరస్పర సహకారం వంటి విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. సాహిత్య రంగంలో కూడా మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 1980 వరకు ప్రచురితమైన పుస్తకాలలో 65% సామాజిక సమస్యలపై ఆధారపడేవి. 2020 తర్వాత ఈ సంఖ్య 25%కు పడిపోయింది. వినోదం ప్రధాన లక్ష్యంగా మారడం వల్ల లోతైన ఆలోచన కలిగించే రచనలు తగ్గాయి. రచయితలు కూడా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రచనలు చేయడం పెరిగింది. ఫలితంగా సమాజ మార్పుకు దోహదపడే సాహిత్యం అరుదవుతోంది. సామాజిక అనుబంధాల విషయంలో కూడా గణనీయమైన మార్పు ఉంది. సంయుక్త కుటుంబ వ్యవస్థ 1990లో 55% ఉండగా, 2020లో 20%కు తగ్గింది. అణు కుటుంబాల పెరుగుదలతో పెద్దలు-పిల్లల మధ్య అనుబంధం తగ్గుతోంది. పండుగలు, సామూహిక కార్యక్రమాలు 35% వరకు తగ్గాయని సాంస్కృతిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి సామాజిక ఐక్యతను దెబ్బతీస్తున్నాయి.

విద్యా వ్యవస్థలో కూడా సాహిత్యానికి ప్రాధాన్యం తగ్గింది. 2005లో పాఠ్యాంశాలలో సాహిత్య భాగం 40% ఉండగా, 2025లో అది 20%కు తగ్గింది. ఉద్యోగాధారిత విద్యపై దృష్టి పెరగడంతో విలువల ఆధారిత విద్య వెనుకబడింది. విద్యార్థులు పుస్తకాల కంటే డిజిటల్ కంటెంట్‌పై ఆధారపడుతున్నారు. ఇది ఆలోచనా సామర్థ్యాన్ని పరిమితం చేస్తోంది. భవిష్యత్తులో ఈ పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. 2035 నాటికి పుస్తక పఠనం మరో 15% తగ్గే అవకాశముందని అంచనాలు చెబుతున్నాయి. మానవ సంబంధాలు కూడా మరింత యాంత్రికంగా మారే ప్రమాదం ఉంది. వ్యక్తులు భావోద్వేగాలకు దూరమై, కేవలం అవసరాల మేరకు మాత్రమే సంబంధాలు కొనసాగించే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాజ నిర్మాణానికి పెద్ద సవాల్. ఈ పరిస్థితిని మార్చేందుకు కొన్ని చర్యలు అవసరం. పాఠశాల స్థాయిలోనే పఠన అలవాటును ప్రోత్సహించాలి. ప్రతి సంవత్సరం కనీసం 10 పుస్తకాలు చదవడం వంటి లక్ష్యాలను విద్యార్థులకు నిర్దేశించాలి. సమాజంలో పుస్తకోత్సవాలు, సాహిత్య సమావేశాలు పెంచాలి. కుటుంబ స్థాయిలో కలిసి చదవడం, చర్చించడం వంటి అలవాట్లు పెంపొందించాలి. రచయితలు కూడా సామాజిక బాధ్యతతో రచనలు చేయాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే, పుస్తకాలు, రచనలు కేవలం వినోద సాధనాలు కాకుండా సమాజాన్ని మలిచే శక్తిగా ఉండాలి. మానవ సంబంధాలు బలపడాలంటే భావోద్వేగాలు, విలువలు తిరిగి స్థాపించాలి. సాహిత్యం ఈ మార్పుకు కీలక పాత్ర పోషించగలదు. లేదంటే భవిష్యత్తులో మన సమాజం యాంత్రిక సంబంధాలతో మాత్రమే పరిమితమైపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రస్తుత విద్యా వ్యవస్థను సమగ్రంగా పరిశీలిస్తే అది ప్రధానంగా ఉద్యోగాధారిత దిశలోనే ప్రయాణిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. 1990 తర్వాత గ్లోబలైజేషన్ ప్రభావంతో విద్యా విధానాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 2000 నాటికి ఉన్న విద్యా నిర్మాణం 50% వరకు జ్ఞానాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అవగాహనపై దృష్టి సారించగా, 2025 నాటికి ఈ శాతం 20%కు పడిపోయిందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అదే సమయంలో ఉద్యోగ సాధన, నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ అవసరాల ఆధారిత విద్య 80% వరకు పెరిగింది. ఇది విద్య యొక్క ప్రాథమిక లక్ష్యాన్ని మార్చేసింది. విద్య అనేది కేవలం ఉపాధి సాధనానికి మాత్రమే పరిమితం కావడం అనేది ఒక పెద్ద సమస్యగా మారుతోంది. గతంలో విద్యార్థులు సాహిత్యం, చరిత్ర, తత్వశాస్త్రం వంటి అంశాల ద్వారా సమాజంపై అవగాహన పెంపొందించుకునేవారు. ఇప్పుడు సైన్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ వంటి రంగాలకే ప్రాధాన్యం పెరిగింది. 2010-2025 మధ్యకాలంలో హ్యూమానిటీస్ కోర్సుల్లో అడ్మిషన్లు 35% వరకు తగ్గగా, టెక్నికల్ కోర్సుల్లో 60% వరకు పెరిగాయి. దీనివల్ల విద్యార్థుల్లో సామాజిక స్పృహ తగ్గుతోంది. సామాజిక అభివృద్ధి అనే అంశం విద్యా వ్యవస్థలో క్రమంగా కనుమరుగవుతోంది. పాఠ్యపుస్తకాలలో సామాజిక సమస్యలు, గ్రామీణ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు కేవలం 15% మాత్రమే స్థానం ఉందని 2024 నివేదికలు తెలియజేస్తున్నాయి. విద్యార్థులు సమాజంలోని అసమానతలు, పేదరికం, సామాజిక న్యాయం వంటి



అంశాలపై లోతైన అవగాహన పొందడం లేదు. ఇది భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరుల కొరతకు దారితీసే ప్రమాదం ఉంది.

ప్రస్తుత విద్యా విధానం పోటీ భావనను అత్యధికంగా పెంచుతోంది. 2005లో విద్యార్థుల్లో పోటీ ఒత్తిడి 40% ఉండగా, 2025లో అది 75%కు పెరిగింది. మార్కులు, ర్యాంకులు, ప్లేస్‌మెంట్లు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. ఈ ఒత్తిడి కారణంగా విద్యార్థుల్లో సామాజిక అనుబంధాలు తగ్గుతున్నాయి. సహకారం, పరస్పర సహాయం వంటి విలువలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విజయంపైనే దృష్టి సారిస్తున్నారు. విద్యాసంస్థల్లో సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం తగ్గింది. 1995లో కళాశాలలలో 60% వరకు ఎన్ఎస్ఎస్, సామాజిక సేవా కార్యక్రమాలు చురుకుగా నిర్వహించబడేవి. 2025 నాటికి ఈ శాతం 25%కు తగ్గింది. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల సమస్యలను అర్థం చేసుకునే అవకాశాలు తగ్గుతున్నాయి. సమాజంతో ప్రత్యక్ష అనుబంధం లేకపోవడం వల్ల సామాజిక బాధ్యత భావం క్షీణిస్తోంది. డిజిటల్ విద్యా విధానం కూడా ఈ సమస్యను మరింత పెంచుతోంది. ఆన్‌లైన్ క్లాసులు, వర్చువల్ లెర్నింగ్ కారణంగా విద్యార్థులు భౌతిక సమాజంతో సంబంధం కోల్పోతున్నారు. 2020 తర్వాత ఆన్‌లైన్ విద్య వినియోగం 70% వరకు పెరిగింది. అయితే, ఈ విధానం వ్యక్తిగత అభ్యాసాన్ని పెంచినా, సామాజిక పరస్పర చర్యలను 50% వరకు తగ్గించింది. ఇది వ్యక్తుల మధ్య అనుబంధాలను బలహీనపరుస్తోంది.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో కూడా అసమతుల్యత కనిపిస్తోంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు, సామాజిక బాధ్యత వంటి అంశాలు వెనుకబడుతున్నాయి. 2023 సర్వే ప్రకారం, 65% విద్యార్థులు సామాజిక సమస్యలపై స్పందించడంలో ఆసక్తి చూపడం లేదు. ఇది విద్యా విధానం లోపాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు విద్యా విధానంలో సమగ్ర మార్పులు అవసరం. పాఠ్యాంశాలలో కనీసం 30% భాగాన్ని సామాజిక అభివృద్ధి, నైతిక విలువలు, సాంస్కృతిక అవగాహనకు కేటాయించాలి. ప్రతి విద్యార్థి సంవత్సరానికి కనీసం 100 గంటలు సామాజిక సేవలో పాల్గొనే విధంగా విధానాలు రూపొందించాలి. గ్రామీణ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రాక్టికల్‌గా నేర్పించాలి. అదేవిధంగా, విద్యాసంస్థలు సాహిత్య చర్చలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు, పుస్తక పఠన వేదికలు నిర్వహించాలి. విద్యార్థుల్లో సమాజంపై బాధ్యత భావం పెంచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ఉపాధ్యాయులు కూడా కేవలం సబ్జెక్ట్ బోధనకు పరిమితం కాకుండా విలువల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొత్తంగా పరిశీలిస్తే, ప్రస్తుత విద్యా వ్యవస్థ పూర్తిగా ఉద్యోగాధారితంగా మారడం వల్ల సమాజ అభివృద్ధి అంశం పక్కనపడింది. ఇది భవిష్యత్తులో సమాజ నిర్మాణానికి తీవ్రమైన సవాల్‌గా మారే అవకాశం ఉంది. విద్య అనేది కేవలం ఉపాధి సాధనమే కాకుండా సమాజాన్ని మలిచే శక్తిగా ఉండాలి. ఆ దిశగా మార్పులు తీసుకురాకపోతే సమాజంలో మానవ సంబంధాలు మరింత బలహీనపడే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

విద్యా వ్యవస్థలో సామాజిక దృష్టికోణం తగ్గిపోవడం వల్ల దీర్ఘకాలిక ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2015-2025 మధ్యకాలంలో విద్యార్థుల్లో సామాజిక చైతన్యం సుమారు 30% వరకు తగ్గిందని వివిధ సర్వేలు తెలియజేస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత అభివృద్ధి పరిమితిలోనే ఆగిపోకుండా సమాజ నిర్మాణంపై కూడా ప్రభావం చూపుతోంది. ఉద్యోగం పొందిన తర్వాత కూడా వ్యక్తులు సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావన 40% వరకు తగ్గినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది బాధ్యతాయుత పౌర సమాజ నిర్మాణానికి అడ్డంకిగా మారుతోంది. ప్రస్తుతం విద్యార్థులలో "సక్సెస్" అనే భావన పూర్తిగా ఆర్థిక స్థిరత్వంతోనే ముడిపడి ఉంది. 2024 అధ్యయనాల ప్రకారం 75% యువతకు విజయానికి ప్రధాన ప్రమాణం జీతం, ఉద్యోగ స్థాయి మాత్రమే. సామాజిక సేవ, ప్రజా ప్రయోజనం, సమాజ అభివృద్ధి వంటి అంశాలు కేవలం 15% మాత్రమే ప్రాముఖ్యత పొందుతున్నాయి. ఈ ధోరణి భవిష్యత్తులో సామాజిక అసమానతలను పెంచే ప్రమాదం కలిగిస్తోంది. సంపద కేంద్రీకరణ పెరగడం వల్ల సామాజిక విభజన మరింత పెరుగుతుంది. విద్యాసంస్థలు కూడా ప్లేస్‌మెంట్ ఆధారిత ప్రమాణాలపై తమ ప్రతిష్ఠను నిర్మించుకోవడం ప్రారంభించాయి. 2010లో కళాశాలల అంచనాలో 50% అకాడెమిక్ నాణ్యత ఆధారంగా ఉండగా, 2025లో అది 30%కు తగ్గింది. అదే సమయంలో ప్లేస్‌మెంట్ రేటు 70% వరకు ప్రధాన ప్రమాణంగా మారింది. దీనివల్ల విద్యాసంస్థలు కూడా సామాజిక బాధ్యతను పక్కన పెట్టి ఉద్యోగ సాధనపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాలపై విద్యార్థుల అవగాహన కూడా గణనీయంగా తగ్గింది. 2000లో విద్యార్థులలో 55% గ్రామీణ సమస్యలపై అవగాహన కలిగి ఉండగా, 2025లో అది 25%కు తగ్గింది. నగరీకరణ ప్రభావంతో గ్రామీణ జీవన విధానం పట్ల ఆసక్తి తగ్గిపోతోంది. ఇది గ్రామీణాభివృద్ధికి అవసరమైన మానవ వనరుల కొరతకు దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యా విధానం పునర్నిర్మాణం అత్యవసరం. విద్యార్థులలో సామాజిక అవగాహన పెంపొందించేందుకు ప్రతి కోర్సులో "సమాజ అధ్యయనం" అనే అంశాన్ని తప్పనిసరిగా చేర్చాలి. కనీసం 20% మార్కులను సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించాలి. ప్రతి విద్యార్థి తన విద్యాకాలంలో కనీసం 2 గ్రామాలను అధ్యయనం చేయడం వంటి ప్రాజెక్టులను అమలు చేయాలి. అదేవిధంగా, పుస్తక పఠనాన్ని విద్యా వ్యవస్థలో కీలక భాగంగా మార్చాలి. ప్రతి విద్యాసంస్థలో లైబ్రరీ వినియోగాన్ని 50% వరకు పెంచే లక్ష్యాలను నిర్దేశించాలి. సాహిత్య చర్చలు, సామాజిక సమస్యలపై డిబేట్లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన పెంపొందించాలి. ఇది సమాజంపై బాధ్యతాయుత దృక్పథాన్ని పెంచుతుంది. మొత్తంగా చూస్తే, ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఉద్యోగాధారిత దృష్టి కొనసాగితే సమాజంలో మానవ విలువలు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడు మాత్రమే సమతుల్య సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. లేకపోతే భవిష్యత్తులో మన సమాజం ఆర్థికంగా బలపడినా, మానవ సంబంధాల పరంగా బలహీనపడే పరిస్థితి అనివార్యం అవుతుంది. ముగింపుగా పరిశీలిస్తే, సమాజంలో జరుగుతున్న మార్పులు కేవలం సాంకేతిక పరిణామాల ఫలితంగా మాత్రమే కాకుండా, మన విలువల మార్పును కూడా స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. పుస్తకాలు, సాహిత్యం, సామాజిక చైతన్యం ఒకప్పుడు వ్యక్తి జీవన విధానాన్ని మారుస్తూ సమాజ నిర్మాణానికి బలమైన పునాది వేశాయి. అయితే 2000 తర్వాత వేగంగా మారుతున్న జీవనశైలిలో ఈ అంశాలు క్రమంగా వెనుకబడుతున్నాయి. 2025 నాటికి పఠన సంస్కృతి 50% వరకు తగ్గిందనే అంచనాలు ఈ పరిస్థితిని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి.

విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఉద్యోగాధారిత దృష్టి 80% వరకు పెరగడం వలన సమాజంపై అవగాహన, బాధ్యత వంటి అంశాలు కేవలం పరిమిత స్థాయిలోనే మిగిలిపోయాయి. ఇది భవిష్యత్తులో సమాజానికి అవసరమైన నాయకత్వ లక్షణాలను దెబ్బతీసే ప్రమాదం కలిగిస్తోంది. విద్యార్థులు ఉద్యోగాలు సాధించినప్పటికీ, సమాజ సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం తగ్గిపోతే అది సమగ్ర అభివృద్ధికి అడ్డంకిగా మారుతుంది. మానవ సంబంధాల పరంగా కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ప్రత్యక్ష సంభాషణలు 40% వరకు తగ్గిపోవడం, డిజిటల్ కమ్యూనికేషన్ 70% వరకు పెరగడం వలన భావోద్వేగ అనుబంధాలు బలహీనపడుతున్నాయి. కుటుంబ వ్యవస్థలు చిన్నవవడం, సమాజంతో అనుబంధం తగ్గిపోవడం వంటి అంశాలు వ్యక్తులను ఒంటరితనానికి దారితీస్తున్నాయి. ఇది మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని సరిదిద్దడం కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. మొదటిగా, పుస్తక పఠనాన్ని తిరిగి ప్రోత్సహించాలి. ప్రతి వ్యక్తి సంవత్సరానికి కనీసం 12 పుస్తకాలు చదవడం వంటి లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. పాఠశాలలు, కళాశాలలు ప్రతి నెల పఠన కార్యక్రమాలు నిర్వహించాలి. సాహిత్యం ద్వారా విలువలను, సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో నాటాలి. విద్యా విధానంలో కూడా సమూల మార్పులు అవసరం. పాఠ్యాంశాలలో కనీసం 30% భాగాన్ని సామాజిక అభివృద్ధి, నైతిక విలువలు, పౌర బాధ్యతలకు కేటాయించాలి. ప్రతి విద్యార్థి తన విద్యాకాలంలో కనీసం 100 గంటలు సామాజిక సేవలో పాల్గొనే విధంగా నిబంధనలు అమలు చేయాలి. ఇది వారికి సమాజంతో ప్రత్యక్ష అనుబంధాన్ని కల్పిస్తుంది. అదేవిధంగా, కుటుంబ స్థాయిలో కూడా మార్పులు అవసరం. పెద్దలు, పిల్లలు కలిసి సమయం గడపడం, పుస్తకాలు చదవడం, చర్చలు నిర్వహించడం వంటి అలవాట్లు పెంపొందించాలి. పండుగలు, సామూహిక కార్యక్రమాలు తిరిగి ప్రోత్సహించాలి. ఇవి మానవ సంబంధాలను బలపరుస్తాయి. మొత్తంగా, సాంకేతిక అభివృద్ధి ఎంత ముఖ్యమైనదైనా, మానవ విలువలు, సామాజిక అనుబంధాలు అంతకంటే ముఖ్యమైనవి. పుస్తకాలు, సాహిత్యం, విద్యా వ్యవస్థ ఈ విలువలను కాపాడే సాధనాలుగా ఉండాలి. లేకపోతే భవిష్యత్తులో మన సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పటికీ, మానవత్వం కోల్పోయే ప్రమాదం ఉంది. సమతుల్య అభివృద్ధి కోసం వ్యక్తి, కుటుంబం, విద్యావ్యవస్థ, సమాజం అన్నీ కలిసి మార్పు దిశగా అడుగులు వేయాల్సిన అవసరం అత్యవసరం.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.